
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

శుక్రవారం 5 జూలై 2024



ఇదిగో పులి

'వెలుగొండ'లో మగ టైగర్ ● నల్లమల నుంచి వచ్చిందని నిర్ధారణ

- ఇప్పటికే ఆడపులి ఉన్నట్టు అటవీ శాఖ గుర్తింపు
- సీసీ కెమెరాల్లో చిక్కిన కదలికలు
- భారీగా చిరుతలూ ఉన్నట్టు గుర్తింపు
- 'టైగర్ కారిడార్'కు ముమ్మర ప్రయత్నాలు
- అటవీ పరిసర గ్రామస్థులను హెచ్చరిస్తున్నాం
- స్మగ్లర్ల ఆటకట్టించేందుకు నిరంతర నిఘా : డీఎఫ్‌వో



నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 4 : వెలుగొండ అటవీ ప్రాంతంలోకి మగ పెద్దపులి ప్రవేశించినట్లు జిల్లా అటవీ అధికారులు నిర్ధారించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతంలోని నల్లమల అడవి నుంచి ఈ పులి నెల్లూరు జిల్లా ఆత్మకూరు రేంజ్ పరిధిలోని వెలుగొండ అడవిలోకి ఇటీవల ప్రవేశించినట్లు గుర్తించారు. మర్రిపాడు తదితర ప్రాంతాల్లో మగ టైగర్ కదలికలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. జిల్లాలోని వెలుగొండ అటవీ ప్రాంతమైన ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు తదితర ప్రాంతాల్లో రెండేళ్లగా ఆడ పులి సంచరిస్తోంది. దీంతో నల్లమల అటవీ ప్రాంతం నుంచి మగ టైగర్ వెతుక్కుంటూ వచ్చినట్లు తెలుస్తోంది.

● టైగర్ జోన్ కోసం నివేదిక

జిల్లాలో పెద్ద పులులు ఉన్నట్లు నిర్ధారించుకున్న అటవీ శాఖ అధికారులు అప్రమత్తమైయ్యారు. వెలుగొండ అడవి పరిధిని టైగర్‌జోన్ కింద గుర్తించాలని ఇప్పటికే కేంద్రానికి నివేదికలు పంపించారు. అప్పటివరకు పెద్దపులుల నుంచి ఎవరికీ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టారు. ఇప్పటికే అనేక చోట్ల సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచారు. హెచ్చరిక బోర్డులనూ ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు పులుల కదలికలను గుర్తించేలా అధికారులు చర్యలు చేపట్టారు. వెలుగొండ పరిధిలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఒంటిరిగా పశువుల మేతకు అడవిలోకి వెళ్లొద్దని హెచ్చరించారు.

● జిల్లాలో పెరిగిన జంతుసంపద

పెద్దపులుల సంచారం ఉన్నచోట అన్ని రకాల జంతుసంపద పెరిగినట్టేనని అటవీ అధికారులు స్పష్టం చేశారు. జిల్లాలోని ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు, వెంకటగిరి తదితర ప్రాంతాల్లోని అడవుల్లో భారీగా జంతుసంపదతోపాటు వన్యప్రాణులు పెరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల ఆత్మకూరు రేంజ్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో మగ టైగర్‌తోపాటు చిరుతలు, ఎలుగుబంట్లు, నక్కలు, పందులు, నెమళ్లు, దుప్పిలు, జింకలు ఇలా అనేక రకాల జంతువులు, వన్యప్రాణులు కదిలికలు చిక్కాయి.

● స్మగ్లర్ల ఆటకట్టించేలా..

జిల్లాలో రెండు పెద్దపులులు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో అటవీ శాఖ అప్రమత్తమైంది. ప్రధానంగా స్మగ్లర్ల నుంచి వన్యప్రాణులకు ఎలాంటి హాని కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అటవీ సిబ్బందికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. టైగర్ జోన్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో జిల్లా అటవీ అధికారులు, సిబ్బంది అందుకు సంబంధించిన చర్యలు ఇప్పటికే ప్రారంభించారు. హెచ్చరిక బోర్డులు, అడవుల్లో ప్రత్యేక తాగునీటి తొట్టెల ఏర్పాటుతోపాటు స్మగ్లర్లు అడవిలోకి ప్రవేశించకుండా నిరంతర నిఘా ఉంచారు. జిల్లావాసులు, ముంబయి జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒంటిరిగా ఎవరూ అడవిలోకి వెళ్లొద్దని జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్ సూచించారు.

మర్రిపాడు : నీటి మడుగు వద్ద సీసీ కెమెరాకు చిక్కిన పెద్ద పులి సంచారం

'కారు ప్రమాదంతో వెలుగులోకి..



మర్రిపాడు : గత నెల 17న పడమటినాయుడు పల్లి అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై ఓ కారుపై పెద్ద పులి దాడి చేసినట్లు డ్రైవర్ తెలపడంతో అటవీ శాఖ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఈ ప్రమాదానికి పులి కారణం కాదంటూనే.. ప్రమాదం జరిగిన పరిసరాల్లో మగ పులి అడుగులు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద స్థలంలో సేకరించిన వెంట్రుకలను శ్రీశైలంలోని ల్యాబ్‌కు పంపించారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి నివేదికలు రాలేదు. అంతిమంగా అక్కడ పులి ఉన్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చి, పరిసర గ్రామాల ప్రజలను అప్ర మత్తం చేశారు. అలాగే అడవిలో మరుగైన ప్రాంతాలు, నీటి స్థావరాల వద్ద సుమారు 60 వరకు సీసీ కెమెరాలను అమర్చారు. ప్రతి వారం ఆ కెమెరాలను రీ సైక్లింగ్ చేస్తూ వీడియో క్లిప్పింగ్‌లను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో ఓ ఆడ పులి, మరో పెద్దపులి తిరుగుతున్నట్లు గత నెల 23వ తేదీన మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో వీడియో రికార్డు అయినట్లు మర్రిపాడు డీఆర్వో రవీంద్రవర్మ తెలిపారు. అయితే, కారు ప్రమాదానికి కారణం పులి అని చెప్పేందుకు తమ వద్ద ఆధారం లేదని అన్నారు.



వెలుగొండ అడవిలో సీసీ కెమెరాలకు చిక్కిన వన్యప్రాణుల కదలికలు







సీసీ కెమెరాలను అమరుస్తున్న అధికారులు, సిబ్బంది

నేత్రానందంగా రామలింగేశ్వరుడి కల్యాణం

● జన సందోహంగా రామతీర్థం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి

విడవలూరు : రామతీర్థంలో గురువారం రాత్రి శ్రీ కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణం కనుల పండుబగా జరిగింది. ఈ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తులు తరలిరా వడంతో పుణ్యక్షేత్రం జనసందో హంగా మారింది. ఉదయం ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం తిరుచా ఉత్సవం,



వేడుకలో పాల్గొన్న భక్తజనం

సాయంత్రం పూలంగి సేవ నిర్వహించారు. ఆ తర్వాత శివపార్వతులను కల్యాణోత్సవానికి విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వివాహ వేదికపై రామలింగేశ్వరుడు, కామక్షీదేవిలను కొలువు దీర్చారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కల్యాణోత్సవానికి శాశ్వత ఉభయకర్త పెన్నార్ ఆక్వా ఎక్స్‌పోర్టు అధినేత ఓజిలి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఉత్సవర్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. పండితుల వేదమంత్రోచ్ఛరణలు పటిస్తుండగా, మంగళవాయిద్యాలు, భక్తుల శివనామస్మరణల నడుమ స్వామిఅమ్మవార్ల కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. రాత్రి రామలింగేశ్వరుడు ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ఏనుగు వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలో ఆలయ ఈవో రామకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాసులు, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఆవుల వాసు, చెముకుల కృష్ణచైతన్య, తాతా రమేష్, శ్రీహరి కోట గోపి, కుడుముల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల శాఖ

ఏడీ గుండెపోటుతో మృతి

నెల్లూరు(హరనాథపురం), జూలై 4 : విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అక్బర్ అలీ గురువారం తన కార్యాలయంలో గుండె పోటుతో మృతి చెందారు. కార్యాలయంలో విధి నిర్వహణలో ఆయన గుండెపోటుకు గురై కుప్పకూలిపోయినట్టు తెలిసింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా మృతి చెందారు.

ఇక చౌకగా ఇసుక!

ఇక పేదలకు ఇసుక చౌకగా లభ్యం కానుంది. కేవలం రవాణా, లోడింగ్ లేబర్ చార్జీలతో ఇసుక పేదల దరిచేరనుంది. దీంతో గత వైసీపీ ప్రభుత్వం ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించడంతో పక్కనే ఉన్న ఇసుక రేట్లు ఆకాశానంటాయి.. దీనివల్ల నిర్మాణ రంగంతోపాటు అనుబంధ రంగాలు కునారిల్లాయి. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక పస్తులు గడిపారు. అయితే, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో 2014లో మాదిరి త్వరలో ఉచిత ఇసుక పాలసీ తీసుకురానుండటంతో కునారిల్లిన నిర్మాణరంగంతో పాటు భవన నిర్మాణ కార్మికులు జవసత్వాలు పురుడుపోసుకోనున్నాయి.



పెన్నానదిలో ఇసుక లోడుతున్న యంత్రం (ఫైల్)

- వైసీపీ హయాంలో కృత్రిమ కొరత, అపై ధర కూడా ఎక్కువే
- కునారిల్లిన నిర్మాణ రంగం, భవన కార్మికులు
- ఎన్నికల హామీ నెరవేర్చే దిశగా టీడీపీ అడుగులు
- రవాణా, లోడింగ్ లేబర్ చార్జీలతో సరఫరా
- త్వరలో కొత్త పాలసీ విధివిధానాలు

సంగం, జూలై 4 : వైసీపీ హయాంలో జిల్లాలో ఇసుక దందా కొనసాగింది. జేపీ వెంచర్‌ను తెరపైకి తెచ్చి ఇసుకను అక్రమంగా రవాణా చేసి వైసీపీ నాయకులు రూ.కోట్లు దండుకున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే కొంతకాలంపాటు ఇసుక తవ్వకాలు ఆపేసి కృత్రిమ కొరత సృష్టించారు. దీంతో నిర్మాణ రంగం కుదేలై పనుల్లేక కార్మికులు రోడ్డున పడ్డారు. దీని ప్రభావం సిమెంట్, స్టీల్, ఇటుక వంటి అనుబంధ రంగాలపైనా పడింది. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సంస్థకు ఇసుక కాంట్రాక్టు ఇచ్చారు. వీరు ఇసుకను తవ్వడంలో నిబంధనలను ఉల్లంఘించారు. పెన్నా, స్వర్ణముఖి వంటి నదుల్లో యంత్రాలతో తవ్వి భారీ వాహనాల్లో ఇసుకను తరలించారు. దీంతో నదులు, వాగులు రూపురేఖలు కోల్పోయాయి. జిల్లాలోని కొన్నిచోట్ల వైసీపీ నాయకులు రంగంలోకి దిగారు. ఎక్కడికక్కడ ఇసుకను అక్రమంగా తమిళనాడు, కర్ణాటకకు తరలించి, సొమ్ము చేసుకున్నారు.

● ట్రాక్టర్ ఇసుక రూ. 3,500 నుంచి రూ. 5వేలు

కృత్రిమ కొరత, అధిక ధరలతో ఇసుక దొరకడం కష్టమైంది. ట్రాక్టరు ఇసుక ధర రూ.3,500 నుంచి 5 వేలకు, టిప్పరు ఇసుక రూ. 8 నుంచి 30 వేలు పెట్టి కొనాల్సిన పరిస్థితి నెలకొంది. పక్క రాష్ట్రాలకు టిప్పర్ల ద్వారా తరలించే ఇసుక ధర రెండింతలైంది. దీంతో ఊరు పక్కనే ఇసుక ఉన్నా.. అంత ధర పెట్టి కొనలేక చాలా మంది ఇళ్ల నిర్మాణాన్ని ఆపేశారు. ఇలా పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కల నెరవేరకుండా చేశారు.

● 2014లో రూ.వెయ్యికే..

2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ హయాంలో ఉచిత ఇసుక పాలసీని అమలు చేసింది. దీంతో ట్రాక్టరు ఇసుక దూరాన్ని బట్టి రూ.1000 నుంచి 1500 ఉండేది. టిప్పరు రూ. 6 వేల నుంచి 8 వేలకు లభించేది. దీంతో ఇసుక అన్ని వర్గాలవారికి సరసమైన ధరలకు అందుబాటులోకి వచ్చింది. నిర్మాణ రంగం ఊపందుకుంది.

● ఎన్నికల హామీ నెరవేర్చే దిశగా..

ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించి అధికారం చేపట్టిన ఎన్డీయే కూటమి ఇచ్చిన ఉచిత ఇసుక హామీ నెరవేర్చే దిశగా అడుగులు ప్రారంభించింది. ఈ నెల 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక పాలసీని తీసుకురానున్నట్లు ప్రభుత్వ పెద్దలు వెల్లడించారు. కేవలం రవాణా, లోడింగ్ లేబర్ చార్జీలు భరిస్తే సరిపోతుందని చెప్పడం జరిగింది. దీంతో ఇసుక కష్టాలు తీరుతాయని భవన నిర్మాణ కార్మికులు, సామాన్యులు భావిస్తున్నారు. ఇసుక చౌకగా, అందుబాటులోకి వస్తే ఇన్నాళ్లు కుదేలైన భవన నిర్మాణ రంగం ఊపందుకోనుంది.

● జిల్లాలో నాణ్యమైన ఇసుక

జిల్లాలో ఇటు పెన్నానదితోపాటు అటు స్వర్ణముఖి, వాగులు, వంకల్లో నాణ్యమైన ఇసుక అందుబాటులో ఉంది. అనంతసాగరం, ఆత్మకూరు, చేజర్ల, సంగం బుచ్చిరెడ్డిపాళెం, పొదలకూరు, నెల్లూరు రూరల్ మండలాల్లోని పెన్నానదిలో నాణ్యమైన ఇసుక అందుబాటులో ఉంది. అంతేగాక స్వర్ణముఖి నదితోపాటు వాగులు, వంకల్లో జిల్లాతోపాటు ఇతర జిల్లాలకు అవసరమైన ఇసుక ఉంది. ఉచిత ఇసుక కొత్త పాలసీ కోసం సామాన్య ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఐదేళ్లగా కునారిల్లిన నిర్మాణ రంగం మళ్లీ ఊపందుకుంటుందని భవన నిర్మాణ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువ చేయండి!

- అధికారులకు నూతన కలెక్టర్ ఆనంద్ ఆదేశం
- కలెక్టరేట్‌లో బాధ్యతల స్వీకరణ



నూతన కలెక్టర్ ఆనంద్‌కు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ సేథుమాధవన్

నెల్లూరు (హరనాథపురం), జూలై 4 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలను దృష్టి పెట్టి ఆ ఫలాలు ప్రజలకు చేరువ అయ్యేలు విధులు నిర్వహించా లని జిల్లా నూతన కలెక్టర్ ఓ ఆనంద్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను వేదపండితులు ఆశీర్వదించగా, జాయింట్ కలెక్టర్ సేథు మాధవన్, కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి, ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించడంలో ప్రత్యేకత చూపాలని ఆదేశించారు. తన సర్వీస్‌లో మొదటి పోస్టింగ్ సబ్ కలెక్టర్‌గా ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరులో పని చేశానని చెప్పారు. ఏడేళ్ల తర్వాత మళ్లీ నెల్లూరుకు రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో తన వంతు కృషి చేస్తానని అన్నారు.

● 'అల్లూరి' ఆదర్శనీయం



అల్లూరు సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్, ఇతర అధికారులు

స్వాతంత్ర్యోద్యమంలో అశువులు బాసిన అల్లూరి సీతారామరాజు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని కలెక్టర్ ఆనంద్ అన్నారు. గురువారం అల్లూరు సీతారామరాజు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ జిల్లా పద్మనాభ మండలం పాండ్రంగి గ్రామంలో జన్మించిన అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య ఉద్యమంలో తన ప్రాణాలను పణంగా పెట్టి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీతోపాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాతకక్షలతో యువకుడి హత్య


నీతురాజ్ మృతదేహం

నెల్లూరు(క్రైం), జూలై 4: పాత కక్షల నేపథ్యంలో నెల్లూరులో గురువారం ఓ యువకుడిని దారుణంగా హత్య చేశారు. సేకరించిన సమాచారం మేరకు... నగరంలోని కొత్తూరు సీతమ్మకాలనీలో శేఖర్ నీతురాజ్ (26) నివాసం ఉంటున్నాడు. రామకోటయ్యనగర్‌కు చెందిన సుమంత్, మనోహర్, చంద్రశేఖర్ అనే స్నేహితులు గత సంవత్సరం జూన్ నెలలో ఆ ప్రాంతంలో టిఫిన్ చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన దేవా మద్యం సేవించి వారి వద్దకు వచ్చి డబ్బులు ఇవ్వాలని అడిగాడు. వారు లేవని చెప్పడంతో గొడవ జరిగింది. ఆ తర్వాత జూన్ 29వ తేదీ అర్ధరాత్రి దేవా తన స్నేహితులు వెంకటేష్, ఏజాస్, నీతురాజ్ తదితరులతో కలిసి చంద్రశేఖర్, మనోహర్‌పై మారణాయుదాలతో దాడి చేసి పరారయ్యారు. తీవ్రగాయాలైన వారు తిరుపతి, చెన్నైలోని వైద్యశాలల్లో చికిత్స పొందారు. సుమంత్ ఫిర్యాదుతో అప్పట్లో వేదాయపాళెం పోలీసులు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో నీతురాజ్ ఐదో నిందితుడు. అప్పటి నుంచి అతనిపై ప్రత్యర్థులు కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నీతురాజ్ మద్యం సేవించి రామకోటయ్యనగర్ పెట్రోల్ బంకు సమీపంలో ఉండగా చంద్రశేఖర్ అలియాస్ చందు మరి కొందరు కలిసి మారణాయుధాలతో విచక్షణా రహితంగా దాడిచేశారు. తలకు తీవ్రగాయాలు కావడంతో నీతురాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వీవీ నారాయణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. హత్యకు పాల్పడిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, మృతుడు నీతురాజ్ టీడీపీ సానుభూతిపరుడని తెలిసింది.

అప్పు చెల్లించలేదని వ్యక్తిపై దాడి

విడవలూరు, జూలై 4: తీసుకున్న అప్పు చెల్లించలేదని వ్యక్తిపై దాడి చేసిన సంఘటన గురువారం విడవలూరులో జరిగింది. బాధితుని కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విడవలూరు గ్రామానికి చెందిన తిరకాల మహేష్ అదే గ్రామానికి చెందిన నిమ్మల వెంకట శేషయ్య దగ్గర అప్పు తీసుకున్నాడు. ఆ నగదు సకాలంలో తిరిగి ఇవ్వలేదని అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మల్లికార్జున, వెంకటశేషయ్య, శివకుమార్, సురేష్ అనే వ్యక్తులు తిరకాల మహేష్‌ను విడవలూరు సినిమా హాలు వద్ద అడ్డగించి తీవ్రంగా గాయపరిచారని బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్ఐ రాజా కేసు విచారణ చేపట్టారు.

'నీట్'పై సమగ్ర విచారణ జరిపించాలి

- వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్యవేదిక డిమాండ్


రోడ్డుపై బైఠాయించిన విద్యార్థి సంఘాల నాయకులు

నెల్లూరు (విద్య), జూలై 4 : నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలను రద్దు చేయా లంటూ విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన జాతీయ బంద్‌లో భాగంగా నెల్లూరులోని వీఆర్సీ సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ దేశంలోని వైద్యవిద్యకు ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్షల ఫలితాలపై అనేక రకాల అనుమానాలు వ్యక్తం అయ్యే విధంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఫలితాలు విడుదల చేసిందని ఆరోపించారు. జూన్ 14న విడుదల చేస్తానన్న ఫలితాలను నాలుగో తేదీనే విడుద ల చేశారని, అదనపు మార్కుల కేటాయింపు కూడా పారదర్శకంగా జరగలేదన్నారు. గతంలో ఫలితాలు రాకముందు ఆన్సర్ కీ విడుదల చేసే సమయంలోనే ఏ ప్రశ్నకు ఏ కారణంతో అదనపు మార్కులు ఇవ్వనుందో ఎన్‌టీఏ కానీ, ఇతర పరీక్షల సంస్థలు కానీ స్పష్టత ఇచ్చేవన్నారు. కానీ ఈ సారి ప్రశ్నించిన తరువాత మాత్రమే వివరణ ఇవ్వడం అనుమానాలు బలపడే విధంగా ఉన్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వైద్య విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని, రాష్ట్ర అసెంబ్లీలో కూడా నీట్ రద్దు గురించి తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్య దర్శి షేక్ మస్తాన్ షరీఫ్, ఎస్ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి హర్ష, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్, విద్యార్థి సంఘాల నేతలు శివమ్ వర్మ, షారూఖ్‌ఖాన్, అక్షయ్, ఆకాష్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

- మందాడి చెరువును ఆక్రమించిన వైసీపీ నేతలు
- యథేచ్ఛగా భవన నిర్మాణాలు
- మాజీ ఎమ్మెల్యే, ఇతర నేతల ప్రోద్బలం


వైసీపీ నేత అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

కావలి,జూలై 4: పట్టణంలోని ముసునూరు మందాడి చెరువు లోతట్టు ప్రాంతాన్ని ఆక్రమించి నిర్మించిన, నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను అధికారులు గురువారం కూల్చివేశారు. చెరువులో రూ.కోట్ల విలువ చేసే స్థలాలను వైసీపీ పాలనలో పలువురు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీనిపై చెరువు పరిరక్షణ సమితి పోరాటం చేసినా, పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు స్పందించలేదు. ఆక్రమణ దారులకు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అండదండలు మెండుగా ఉండటంతో అధికా రులు అడ్డుకోలేకపోయారు. దీంతో చెరువంతా కుంచించుకుపోయింది. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి ప్రోద్బలంతో వైసీపీ అనుచరులు కొందరు పలు సంఘాలుగా ఏర్పడ్డారు.ఆ సంఘాల పేరుతో చెరువును ఆక్రమించగా అక్కడ నిర్మాణాల శంకుస్థాపనలో ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.ఇంతలో ఎన్నికల కోడ్ రావటంతో అధికారులు అక్రమ నిర్మాణాలను ఆపారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. ఇది ప్రభుత్వ భూమి అని అధికారులు అక్కడ బోర్డులు పెట్టినా లెక్కచేయలేదు. దీంతో అధికారులు ఓ కమిటీ వేసి చెరువులో చేపట్టిన నిర్మాణాలపై విచారణ చేపట్టారు ఎవరి దగ్గర హక్కు పత్రాలు లేకపోవటంతో ఎట్టకేలకు వాటిని కూల్చివేశారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి


ప్రమాదంలో మృతిచెందిన అహ్మద్‌బాషా

నెల్లూరు(క్రైం), జూలై 4: నెల్లూరులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సేకరించిన సమాచారం మేరకు.... రంగనాయకుల పేట రైలువీధిలో షేక్ అహ్మద్‌బాషా (54), గౌసియా దంపతులు నివసిస్తున్నారు. వారికి నలుగురు కుమారులు. అహ్మద్‌బాషా అల్యూమి నియం కిటికీలు, డోర్లు తయారు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం పనివాళ్లను తీసుకుని మూడో మైలుకు వెళ్లి స్కూటీపై తిరిగి వస్తున్నాడు. ప్రశాంతినగర్ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా చెన్నైవైపు నుంచి కావలి వెళుతున్న లారీ ఇటుక ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టింది. ఆ ట్రాక్టర్ పక్కనే వస్తున్న స్కూటీకి తగలడంతో అహ్మద్‌బాషా రోడ్డుపై పడి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ కే గీతారమ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మర్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	264
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6907
వెండి కిలో ధర	రూ. 92,600
వెండి ఒక గ్రాము	రూ. 94.60



- జీజీహెచ్‌లో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీకి అందని వేతనాలు
- 7 నెలలుగా నిధులు రాలేదంటున్న కాంట్రాక్టర్
- వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో రూ.5.60 కోట్లు పెండింగ్
- లబోదిబోమంటున్న చిరుద్యోగులు

నాలుగు నెలలుగా

జీతాల్లేవు!

రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లు పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. నాటి పాలకులు చిరుద్యోగులకు వేతనాలు కూడా సక్రమంగా చెల్లించకపోవడంతో ఇప్పుడు వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో ఇల్లు గడవక, అప్పు ఇచ్చేవారూ లేక ఆర్థిక సమస్యలతో అల్లాడుతున్నారు.

నెల్లూరు(వైద్యం), జూలై 4 : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో గత ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణ కాంట్రాక్టును ఏజెల్ సంస్థకు అప్పగించింది. అక్కడి పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు, నిర్వహణ ఖర్చు కింద ప్రతినెలా సుమారు రూ.80 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే గతేడాది డిసెంబరు నుంచి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. కానీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏజెల్ కాంట్రాక్ట్ సంస్థ మూడు నెలలు స్వంతంగా జీతాలు చెల్లించాల్సి ఉండటంతో ఆ మేరకు డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి వేతనాలు, ఇతర ఖర్చులకు రూ.2.40 కోట్లను సదరు సంస్థ చెల్లించింది. ఆ తర్వాత కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో చేతులెత్తే సింది. ఇప్పటి వరకు మొత్తం 7 నెలల కు రూ. 5.60 కోట్లు బకాయి పేరు కుంది. ప్రస్తుతం ఈ ఫైలు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో ఉంది. ఇటీవల కొలువుదీరిన టీడీపీ ప్రభుత్వం ఆ నిధులు మంజూరు చేస్తుందని చిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇటీవల జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను కలిసి తమకు వేతనాలు చెల్లించేలా సహకరించాలని వేడుకున్నారు.

359 మంది చిరుద్యోగులు

పారిశుధ్య కార్మికులు ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలో 145 మంది, వైద్య కళాశాలలో 54 మంది పనిచేస్తున్నారు. అలాగే సెక్యూరిటీ సిబ్బంది వైద్యశాలలో 100 మంది, కళాశాలలో 25 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇక, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో 25 మంది పారిశుధ్య కార్మికులు, 10 మంది సెక్యూరిటీ పనిచేస్తున్నారు. వీరిలో పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.16వేలు, సెక్యూరిటీ సిబ్బందికి రూ.13500 వేతనం చెల్లిస్తున్నారు. ఈ లెక్కన మొత్తం 359 మందికి నెలకు రూ.54 లక్షలు వేతనంగా, నిర్వాహణ కింద రూ.26 లక్షలు చెల్లించాలి. మూడు నెలలకు ఒకసారి వీరి జీతాలకు నిధులు విడు దల చేయాల్సి ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయలేదు. దీంతో ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంపై భారం పడుతోంది.


వేతనాలు వెంటనే చెల్లించాలి



పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బందికి వేతనాలు వెంటనే చెల్లించాలి. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ సిద్దానాయక్‌కు కూడా వినతిపత్రం ఇచ్చాము. త్వరలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరిస్తాము. ప్రభుత్వం త్వరగా ఏజెల్ సంస్థ ద్వారా వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- సందానీబాషా, యునైటెడ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి

అప్పులు ఇచ్చే వారూ లేరు



నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవటంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు ఇచ్చేవారు కూడా లేరు. కుటుంబం గడవటం చాలా కష్టంగా ఉంది. జీతాలు వస్తేనే ఇల్లు నడుపుకోవాల్సిన పరిస్థితి. ప్రభు త్వం మానవతా దృక్పథంతో ఆలోచించి బకాయిలు చెల్లించేలా చూడాలి.

- శామ్యూల్, సెక్యూరిటీ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు


ఎన్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీకి వినతి పత్రం అందచేస్తున్న బిట్రగుంట వాసులు

బిట్రగుంట రైల్వేను అభివృద్ధి చేయాలని వినతి

బిట్రగుంట, జూలై 4: మా తాతలు,తండ్రులే కాదు.. మేము రైల్వే ఉద్యోగులుగా పనిచేసి రిటైరయ్యాం. శిథిలావస్థకు చేరుకుంటున్న బిట్రగుంట రైల్వేను అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టండి సార్.. అంటూ ఎన్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్యను బిట్రగుంట అభివృద్ధి అసోసియేషన్ సభ్యులు కోరారు. న్యూఢిల్లీలోని ఎన్ఎఫ్ఐఆర్ కార్యాలయంలో అసోసియేషన్ సభ్యులు చల్లా నరహరి, నూకసాని శ్రీనివాసులు యాదవ్, జే.నాగరాజు గురువారం ఆయన్ను కలసి వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ బిట్రగుంట రైల్వేస్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ తిరిగి ప్రారంభించాలని, కోవిడ్ సమయంలో నిలిపివేసిన రైళ్లను పునరుద్ధంచాలని, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని కోరారు. ఎల్సీ గేట్ 143 వద్ద బాక్స్‌టైప్ బ్రిడ్జి, 144 వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలను వెంటనే చేపట్టాలన్నారు. సానుకూలంగా స్పందించిన రాఘవయ్య యూనియన్ సభ్యులతో చర్చించి, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

జీజే రావుకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

ముత్తుకూరు, జూలై 4 : అదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జీజేరావు కార్గో మరియు లాజిస్టిక్స్ సెక్టార్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నందుకు 15వ సౌత్ ఈస్ట్ కార్గో, లాజిస్టిక్స్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ - 2024 అవార్డును గురువారం చెన్నైలో అందుకున్నారు. ఎగ్జిమ్ ఇండియా షిప్పింగ్ టైమ్స్ చెన్నైలో కార్గో మరియు లాజిస్టిక్స్ సౌత్ ఈస్ట్ సీఈవో కాంక్లేవ్, అవార్డ్స్ 15 ఎడిషన్ కార్యక్రమాలు నిర్వహించింది. పోర్టు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మెరుగుపరచడంలో, సామర్థ్యాలను పెంచడంలో, భారతదేశంలో కొత్త ఓడరేవు స్థానాలను పొందడంలో జీజేరావు కీలక పాత్ర పోషిం చారు. ప్రస్తుతం జీజేరావు అదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్‌తో పాటు కట్టుపల్లి, ఎన్నూ ర్ పోర్ట్స్, చెన్నై, తమిళనాడు మేనేజింగ్ డైరెక్టర్ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, పోర్టు ఆపరేషన్, నిర్వహణ, తదితర బాధ్యతలు కలిగి ఉన్నారు. కాగా, జీజేరావుకి అవా ర్డు రావడంతో పోర్ట్ ఉద్యోగులు, అధికారులు అభినందించారు.

వీఎస్‌యూను మరింత అభివృద్ధి చేసుకుందాం

- ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ సునీత


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ సునీత

వెంకటాచలం, జూలై 4: విక్రమ సింహపురి యూనివర్సిటీని మరింతగా అభివృద్ధి చేసుకోవడానికి అందరి సహకారం అవసరమని వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత అన్నారు. స్థానిక వీఎస్‌యూలో గురువారం ఆమె ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వర్సిటీలో సిబ్బందితో కలిసి ఆమె మీడియా సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. 2008లో నెల్లూరులో అద్దె భవనాల్లో ఏర్పాటైన వర్సిటీ గత 15 ఏళ్లలో అంచెలంచెలుగా ఎదుగుతూ కాకుటూరు వద్ద సొంత భవనాల్లోకి మారి ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకి బాటలు వేస్తూ, ఎందరికో ఉపాధి కల్పిస్తూ జిల్లాకే తలమానికంగా నిలిచిందన్నారు. రాష్ట్ర చరిత్రలోనే తొలివిడతలో న్యాక్ ఏగ్రేడ్ సాధించిన వర్సిటీగా ఘనత దక్కిందన్నారు. ఇంతటి అభివృద్ధికి కారణం వర్సిటీ సిబ్బంది, అధికారులేనన్నారు. జిల్లాలో రాజకీయ పార్టీలకు అతీతంగా పాలకులు, నాయకులు వర్సిటీపై చూపిన శ్రద్ధ వెలకట్టలేనిదన్నారు. వర్సిటీలో నెలకొన్న సమస్యలను సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే వాటన్నింటిని పరిష్కరించారని కొనియాడారు. కార్యక్రమంలో సిహెచ్ విజయ, సాయిప్రసాద్‌రెడ్డి, సుజయ్‌కుమార్, ఆర్ మధుమతి, ఉస్సేనయ్య, విజయానంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలే లక్ష్యంగా చోరీలు

- 8 కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్ట్


నిందితుల వివరాలు తెలుపుతున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైం), జూలై 4: ప్రభుత్వ పాఠశాలలనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నేరస్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో నిందితుల వివరాలను ఏఎస్పీ సీహెచ్ సౌజన్య గురువారం వెల్లడించారు. దుత్తలూరు మండలం, రాచవారిపల్లి గ్రామానికి చెందిన పత్తి వెంకటరత్నం, ప్రకాశం జిల్లా దండుపాలెం గ్రామానికి చెందిన షేక్ మునీర్ బాషా మిత్రులు. వారు జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటుపడి ప్రభుత్వ పాఠశాలల్లో దొంగతనాలు చేయడం ప్రారంభించారు. ఏఎస్ పేట, ధగదర్తి, విడవలూరు, సంగం, ఉదయగిరి, వీకే పాడు, మర్రిపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలల్లో నిందితులు చోరీలకు పాల్పడ్డారు. సీసీఎస్, ఆత్మకూరు పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి గురువారం ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా ప్రభుత్వ పాఠశాలల్లో చోరీలు చేసినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి రూ.10 లక్షల విలువ చేసే 118 సీలింగ్ ఫ్యాన్లు, 4 టీవీలు, ల్యాప్‌టాప్, ఏసీ, సీపీయూ, ప్రింటర్, 75 వైర్ కాయిల్స్, దొంగతనాలకు ఉపయోగించిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరైన వెంకటరత్నంపై బద్వేల్, మర్రిపాడు, ఉదయగిరి పరిధిలో ఎర్రచందనం కేసులు ఉన్నాయని, బైక్‌ల చోరీ కేసులో ప్రధాన నిందితుడిగా ఉండటంతో కోవూరు స్టేషన్ పరిధిలో సస్పెక్ట్ షీట్ ఉందని ఏఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనపరిచిన సీసీఎస్ డీఎస్పీ పీ రామకృష్ణాచారి, ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కోటేశ్వరరావు, కే సాంబశివరావు, సంగం ఇన్‌స్పెక్టర్ రవినాయక్, ఏఎస్ పేట ఎస్ఐ కే ప్రసాద్‌రెడ్డి, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), జూలై 4 : భారత ప్రభుత్వం అందించే జాతీయ ఉపాధ్యాయ అవార్డులు-2024కు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో పీవీజే రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులు nationalawardtoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 15వతేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

తల్లి మందలించిందని విద్యార్థి పరారీ


మనోజ్

కావలి రూరల్ : పాతూరు జొన్నాయగుంట ప్రాంతానికి చెందిన 10వ తరగతి విద్యార్థి కొమ్మర్ల మనోజ్ కనిపించ కుండా పోయాడని అతని తండ్రి కేశవ గురువారం రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేశవ జీడీ కాంప్లెక్స్‌లో కేఎస్ఆర్ వస్త్ర దుకాణం నిర్వహిస్తుండగా, షాపు వద్ద ఉన్న మనోజ్‌ను తల్లి మందలించింది. దీంతో ఉదయం 11 గంటలకు మనోజ్ షాపు నుంచి వెళ్లిపోయాడు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'సోమశిల'లో నీటినిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారానికి డ్యాంలో 10.155 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 352 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

పాముకాటుతో కౌలు రైతు మృతి

అనంతసాగరం, జూలై 4: చిలకలమర్రికి చెందిన కౌలు రైతు డబ్బుకుంట శ్రీనయ్య (45) గురువారం పాము కాటుతో మృతి చెందాడు. పొలంలో పంటకు నీరు కట్టేందుకు వెళ్లగా పాముకాటు గురికావడంతో అక్కడ నుంచి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు సమా చారం ఇచ్చాడు. వారు అతన్ని ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరు తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు సోమశిల పోలీసులు కేసు నమోదు చేశారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలి

- ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి


నేను బడికి పోతా ర్యాలీలో అధికారులు

నెల్లూరు (విద్య), జూలై 4 : బడిబయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, ప్రజలంతా తమకు సహకరించాలని సమగ్రశిక్ష ఏపీసీ సీహెచ్ ఉషారాణి కోరారు. నేనుబడికి పోతా, విద్యా ప్రవేశం కార్యక్రమంలో భాగంగా గురువారం నెల్లూరులోని ఆటోనగర్ ప్రాంతంలో ఏపీ రెసి డెన్షియల్ మైనార్టీ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆటోనగర్ ప్రాంతంలో అత్యధికంగా డ్రాపవుట్స్ ఉన్నారని, వారిని పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులు తమకు సహకరించాలన్నారు. నేను బడికిపోతా కార్యక్రమం ద్వారా జిల్లాలో ఎంతో మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పిస్తున్నామని, జిల్లా, మండల, ఆవాస ప్రాంతాల్లో కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, ముస్లిం పిల్లలను అయ్యప్పగుడి సమీపంలోని ఏపీ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో చేర్పించాలన్నారు. జిల్లాలో ముస్లిం మైనార్టీలు ఉన్న అన్ని ఆవాస ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి పిల్లలను ఉర్దూ పాఠశాలల్లో చేర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సుధీర్‌బాబు, ఎంఈవో మురళి, సీఎంవో, జీసీడీవో, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టండి

- కేంద్ర జలశక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ


నాగసముద్రంలో కుంటలను పరిశీలిస్తున్న కేంద్రబృందం

కలిగిరి, జూలై 4: ఎక్కడ పడిన వర్షపునీటిని అక్కడే ఒడిసిపట్టడం జలజీవన్ మిషన్ కార్యక్రమ ఉద్దేశమని కేంద్ర జలశక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ సచిద్రకుమార్ పట్నాయక్ తెలిపారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని సిద్దనకొండూరు, నాగసముద్రం, కలిగిరి ప్రాంతాల్లో ఉపాధి పథకంలో చేపట్టిన చెక్‌డ్యాంలు, కుంటలు, ఉద్యానవన పంటలను కేంద్ర బృందం పరిశీలించింది. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసినపుడు ఆ నీటిని అధికశాతం నిల్వచేసి స్థానిక రైతులకు ఉపయోగపడేలా చేయడమే జలజీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశమన్నారు. అలాగే ఉపాధి కూలీలకు పనులు కల్పించడంతోపాటు ఆ పనులు రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాసరావు, ఏపీడీ గాయత్రి, ఎంపీడీవో రంగసుబ్బరాయుడు, ఈవోపీఆర్డీ వెలుగోటి మధు, ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

శకునాలపల్లిలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు

ఉదయగిరి రూరల్, జూలై 4: డయేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా శకునాలపల్లిలో సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి సూచన మేరకు గురువారం కార్యదర్శులు కరీముల్లా, తేజలు పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పైపులైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టారు. మురుగు ప్రాంతాల్లో నిల్వ నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. వీధుల్లో దెబ్బతిన్న వీధిదీపాలను తొలగించి నూతన కొత్తవాటిని ఏర్పాటు చేశారు.



పైపులైన్ మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

రోడ్లకి అడ్డంగా కేబుల్ వైర్లు

● పొంచి ఉన్న ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు

కావలి, జూలై 4 : పట్టణంలో రహదారుల వెంబడి వివిధ కంపెనీల కేబుల్ వైర్లు, డిష్ వైర్లు అడ్డదిడ్డంగా వదిలేసి ఉన్నారు. నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, వాహన చోదకులకు రోడ్డు వెంబడి ఉన్న ఈ వైర్లతో ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వైర్లు తగిగి ఎంతో మంది కిందపడిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. మున్సిపాలిటీలో పనులు లేకుండా జీతాలు తీసుకునే అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఎంతోమంది ఉన్నారు. వారికి వైర్లు తప్పించే బాధ్యత అప్పగిస్తే ఓ గంటలో ఆ పని చేయవచ్చు. ప్రధానంగా ట్రంకురోడ్డు వెంబడి, ఆర్వోబీ వంతెనపై ఉదయగిరి రోడ్డు వెంబడి ఈ కేబుల్ వైర్లు గతంలో వీధిలైట్ల స్తంభాలకు కట్టి ఉండటంతో వాటికి పెయింట్ వేస్తూ స్తంభాలకు ఉన్న వైర్లను తొలగించారు. దీంతో అవి రోడ్ల వెంబడి వేలాడుతుండగా, కొందరు వాటిని కట్ చేశారు. దీంతో ఆ వైర్లు ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి. వాటిని తగులుకుని ఎక్కడ ప్రమాదాలకు గురవుతామోనని ప్రజలు, వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కేబుల్ వైర్లు, డిష్ వైర్లను తొలగించాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఆర్వోబీ వంతెన ఫుట్‌పాత్‌పై అడ్డదిడ్డంగా పడేసిన కేబుల్ వైర్లు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, జూలై 4 : మండలంలోని మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు.ముందుగా అందిన సమాచారం మేరకు వీఆర్‌కోట మన్నేరు వాగులో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గురువారం ఉదయం ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఎస్టీలైతే విచారణకు ఎందుకు రాలేదు?

బిట్రగుంట,జూలై 4: నిజంగా ఎస్టీ కులానికి చెందిన వారైతే బహిరంగ విచారణకు పీట్ల ధనమ్మ ఎందుకు రాలేదని ఏపీ ఎరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ, మండల నేత భోగిరి యోహాను అధికారులను ప్రశ్నించారు. బోగోలు మండలం కప్పరాళ్ళ తిప్ప బౌడస్‌పేట చర్చి ఆవరణంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారిని పరిమళ గురువారం సాయంత్రం బహిరంగ విచారణ చేపట్టారు.తహసీల్దారు ఎస్.వెంకటరత్నం, ఆర్ఐ వాజీద్, వీఆర్వో హరిబాబులతోపాటు గ్రామ పెద్దలు ఆకుల డేవిడ్‌పాల్, ఆవుల నాగేశ్వరావు, గొడ్డేటి బాబు విచారణలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి పీట్ల ధనమ్మ హాజరు కాకపోవడంతో అధికారులు విచారణ వాయిదా వేసినట్లు తెలిపారు. మరోసారి ఆమెను పిలిచి విచారణ జరుపుతామని తహసీల్దార్ పేర్కొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



సంగంలో అధికారుల నివాళి..

సంగం: రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు రమాదేవి అధికారులతో సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు

సీతారామపురం: స్థానిక మండల కార్యాలయంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. కార్యదర్శులు రామ్‌నాథ్‌రెడ్డి, జీవన్, సీనియర్ అసిస్టెంట్ ఖలీల్, జూనియర్ అసిస్టెంట్ రాజేష్, కిరణ్, బండి రవి పాల్గొన్నారు.



ఆత్మకూరులో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ వాణిశ్రీ, అధ్యాపకులు

ఆత్మకూరు, జూలై 4: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వాణిశ్రీ గురువారం అల్లూరి సీతా రామరాజు జయంతి సందర్భంగా అధ్యాపకులు, సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఉదయగిరిలో..

ఉదయగిరి: స్థానిక ఎంజీఆర్ వ్యవసాయ కళాశాలలో డాక్టర్ జీ.కృష్ణారెడ్డి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సీతారామపురంలో..

అనంతసాగరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం, చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్ మస్రూర్, హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.



అనంతసాగరం: వేడుకల్లో పాల్గొన్న అధికారులు

అవినీతి రహిత పాలన అందిస్తా : ఎమ్మెల్యే కావ్య

కావలి, జూలై4: అవినీతి రహిత పాలన అందిస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. వంగవీటి మోహన్ రంగా 77వ జయంతిని పురస్కరించుకుని గురువారం రైతుబజారు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ముందుగా అక్కడ నిర్మిస్తున్న రంగా విగ్రహ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పరితపించిన వ్యక్తి వంగవీటి రంగా అన్నారు. ముందుగా రంగా విగ్రహ కమిటీ గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లును సత్కరించారు. ఈకార్యక్రమంలో కమిటీ బాధ్యులు, కాపునాయకులు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.రంగా అభిమాని దేవరకొండ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అల్లూరు : దివంగత కాపు నేత వంగవీటి రంగా 77వ జయంతిని పురస్కరించుకొని గురువారం అల్లూరులోని బలిజపాలెంలో వేడుకలను నిర్వహించారు. పట్టణ కాపు యూత్ ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి పాలభిషేకాన్ని నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి అఖిలేష్, పీసాయి, ఎం.సాయి. ఆర్.చెన్నకేశవ, పీ రాము, కాపు యూత్ తదితరులు పాల్గొన్నారు.



రంగా జయంతి సందర్భంగా ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

ఊరూరా ఎమ్మెల్యే ఇంటూరి జన్మదిన వేడుకలు



గుడ్లూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



ఉలవపాడులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు



లింగసముద్రంలో కేక్ కట్ చేస్తున్న వేముల గోపాలరావు

కందుకూరు : ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. అనంతరం ఏరియా హాస్పటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. స్వర్ణస్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో కేకు కట్‌చేసి విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారు. వివిధ ఆలయాల వద్ద యాచకులకు భోజన ప్యాకెట్లు అందచేశారు. పలుచోట్ల బాణసంచా కాల్చి వేడుకలు నిర్వహించారు. జనార్దన్‌కాలనీ, ఎర్రగుంటపాలెం ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ స్కూళ్లలో విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. 6వ వార్డులో స్థానిక నేతలు, కార్యకర్తలు కేకు కట్‌చేశారు. తలతోటి మస్తాన్ ఆధ్వర్యంలో ఏరియా హాస్పటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండలంలోని పాలూరులో వినోద్‌కుమార్‌రెడ్డి, హరికృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. విద్యార్థులకు ప్లేట్లు స్వీట్లు పంపిణీ చేశారు.

గుడ్లూరు : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను గురువారం గుడ్లూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ ట్రస్టు భవన్ వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జని గర్ల నాగరాజు, నాయకులు పువ్వాడి వేణు, మేకల మాల్యాద్రి, కావలి ఏసు దాస్, మద్దసాని కృష్ణ, ఉమ్మినేని సుబ్బారావు, చిత్తారి మల్లికారున తదిత రులు పాల్గొన్నారు.

ఉలవపాడు : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఉలవపాడులో గురువారం ఘనంగా జరిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. అదేవిధంగా మండలంలోని అన్నీ గ్రామాల్లో వేడుకలు జరిగాయి.

లింగసముద్రం : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. లింగసముద్రంలో మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అంబేద్కర్‌నగర్‌లో గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాదరావు, టీడీపీ నాయకుడు సీహెచ్ బాలకోటయ్యలు కేక్ కట్ చేశారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, ఉపాధ్యక్షుడు అడపా నరసయ్య కేజీబీవీ హైస్కూల్‌లో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పూరిమిట్ల మాల్యాద్రి చినపవని హెచ్‌పీ పాఠశాలలో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కండే మాలకొండయ్య, ఏ చినసత్యం, జే శివప్రసాదు, జీ బాలనారాయణ, బింకం శేషయ్య, జే క్రిష్ణయ్య, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పెదపవనిలో గ్రామపార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య కూడా వేడుకలు నిర్వహించారు.

అత్యవసర పనులకు రూ.43 లక్షలతో ప్రతిపాదనలు

ఉదయగిరి రూరల్, జూలై 4: ఉదయగిరి జలవనరుల శాఖ సబ్ డివిజన్ పరిధిలో గండిపాళెం జలాశయం, చెరువుల అత్యవసర పనుల కోసం రూ.43లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు గురువారం ఆ శాఖ డీఈ చంద్రమౌళి తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే గండిపాళెం జలాశయం కాలువల్లో పూడికతీత, చెరువుల మరమ్మతులు చేపడతామన్నారు. చెరువులోని మట్టి అవసరమైన వారు కార్యాలయాన్ని సంప్రదించి అనుమతులు తీసుకోవాలన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

సంగం, జూలై 4: తలుపూరుపాడు ఖాదర్‌భాషాపై దాడికి పాల్పడిన బాదుల్లా అతని కుమారుడు హుసేన్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీస్‌లు తెలిపారు. చెరువులో అక్రమంగా గ్రావెల్ తరలింపును అడ్డుకున్నందుకు తనపై వారు దాడి చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బీసీజీ టీకా కార్యక్రమం పరిశీలన

సంగం, జూలై 4: వెంగారెడ్డిపాళెం, పడమటిపాళెంలో జరుగుతున్న అడల్ట్ బీసీజీ టీకా కార్యక్రమాన్ని స్టేట్ మానిటరింగ్ అధికారి కె.దేవగణేష్, జిల్లా అదనపు వైద్యాధికారి, టీబీ, లెప్రసీ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి పరిశీలించారు. వ్యాక్సిన్ క్యారియర్, కోల్డ్ స్టోరేజ్‌ని, అత్యవసర మందుల కిట్‌ను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు వ్యాక్సిన్ వేసినట్లు నమోదైన వారికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జలీల్ అహ్మద్, ఎస్టీఎస్ సురేష్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రత్యూష, హెచ్‌ఏ ప్రసాద్, ఏఎన్ఎం రాజమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి జయంతి

సంగం, జూలై 4: మండలకేంద్రంలో గురువారం జనసేన నాయకులు వంగవీటి మోహన్‌రంగా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆర్థికసాయం

ఉదయగిరి, జూలై 4: భారత సాయుధ దళాల మాజీ సైనికుల కుటుంబాల్లోని చిన్నారులకు గురువారం ఉదయగిరి దళితవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. అంతకుముందు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేపల వేట నిషేధం

అనంతసాగరం, జూలై 4: స్థానిక చెరువు పైలెట్ ప్రాజెక్టు పరిధిలో ఉందని అందులో చేపల వేట నిషేధించినట్లు అనంతసాగరం మత్స్యశాఖ అధికారి శ్రీనివాసులు గురువారం తెలిపారు. వేటసాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సచివాలయం తనిఖీ

సీతారామపురం: సీతారామపురం బిట్-1 సచివాలయాలన్ని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ బుధవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు రామ్‌నాథ్‌రెడ్డి, జీవన్, డిజిటల్ అసిస్టెంట్ రమేష్ చంద్ర, ఇంజనీర్ అసిస్టెంట్ సుమతి పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కావలి రూరల్: స్థానిక బుడంగుంట గేటు వద్ద గురువారం రాత్రి రైలు ఢీకొని వాయిల పెంచలమ్మ(60) మృతి చెందింది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు, పట్టణంలోని కోఆపరేటివ్ కాలనీకి చెందిన పెంచలమ్మ రైల్వేగేటు వేసి ఉన్నా రైలును గమనించకుండా గేటు దాటు సమయంలో హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. మృతురాలి వద్ద లభించిన ఆధారాల మేరకు పెంచలమ్మగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ అరుణకుమారి కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

ఆత్మకూరు, జూలై 4: ఎన్టీఏ నిర్వహించిన నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీ, అక్రమాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఆత్మకూరులో చేపట్టిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాఠశాలలు, కళాశాలల వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి చక్రి, అధ్యక్షుడు ఖాదర్‌బాష, ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు అఖిల్, ఉపాధ్యక్షుడు యస్థానీ పాల్గొన్నారు.



ఆత్మకూరులో విద్యార్థి సంఘాల నాయకుల నిరసన

ఉదయగిరి: ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల తరగతులను బహిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడారు. పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

వింజమూరు, జూలై 4: మండలంలో గురువారం జలశక్తి అభియాన్ కేంద్ర బృందం నీటి సంరక్షణ పథకాన్ని పరిశీలించారు. బృంద సభ్యులైన సత్యేంద్రకుమార్, పట్నాయక్, లోకేష్, లక్ష్మీనారాయణలు మొదట మండల కార్యాలయంలో నీటి సంరక్షణ నిలువ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం చాపలకొండలో గ్రామ చెరువును పరిశీలించి కొన్ని సలహాలు సూచనలను అధికారులకు తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం పనులను పరిశీలించారు. కాలువలు, చెరువులను శుభ్రప రచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాసులు, ఎండీపీవో రాజేష్‌బాబు పాల్గొన్నారు.



నీటి సంరక్షణ నిలువ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వరికుంటపాడు: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రామాపురంలో చేపట్టిన పనులను కేంద్రబృందం సభ్యులు పరిశీలించారు. గ్రామంలోని రామరాజుకుంట వద్ద రూ.10,50,863 లక్షల వ్యయంతో చేపట్టిన పనులను సమగ్రంగా చేపట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీరు వృథా కాకుండా వడిసిపట్టడమే లక్ష్యంగా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బృంద సభ్యులు లక్ష్మీనారాయణ, లోకేష్, డ్వామా పీడీ శ్రీనివాసులు, డ్వామా అసిస్టెంట్ ఏపీడీ విజయలక్ష్మి, ఏపీడీలు శంకర్‌నారాయణ, గాయత్రీ దేవి, మృదుల, ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి, ఏపీవో అజమ్‌ఖాన్ పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం



అమ్మవారి ఆలయానికి ఊరేగింపు వస్తున్న మహిళలు

సంగం, జూలై 4: అనసూయనగర్‌లో గురువారం అర్ధరాత్రి పోలేరమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా పోలేరమ్మ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గజమాలలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ఉదయగిరి: గన్నేపల్లిలో వెలసిన అడవిపేరంటాలమ్మకు భక్తులు నెల పొంగళ్లు సమర్పించారు. గన్నేపల్లి, గడ్డంవారిపల్లి, జెట్టివారిపల్లి, మిట్టపల్లి, కొట్టాలపల్లి, సర్వరాబాదు మహిళలు కొత్త గంపల్లో పూజ సామగ్రిని పెట్టుకుని డబ్బు వాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి చేరుకొన్నారు. అమ్మవారి సన్నిధిలో పొంగళ్ల నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల వద్ద రైతుల ఆందోళన

సీతారామపురం, జూలై 4: మండలకేంద్రంలోని చెక్‌పోస్ట్ నుండి ఉత్తరం వైపు ఉన్న ఎన్‌హెచ్ 167బి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయాలని గురువారం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి ఆధ్వర్యంలో గ్రామ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న తమ భూములు ఉన్నాయని, ఈ భూములకు మధ్యలో వాగు పోతుందని, నేషనల్ హైవే అధికారులు వాగునకు ఎదురుగా బ్రిడ్జి కట్టకుండా తమ పొలాల్లోకి నీరు పోయేలా బ్రిడ్జి నిర్మాణం చేప డుతున్నారని మండిపడ్డారు. వాగుకు ఒక కానాల్ మాత్రమే నిర్మిస్తున్నారని అందులో చెరువు అలుగునీరు, కుంటలోని నీరు పట్టక మా భూముల్లోకి వాన నీరు వచ్చి పొలాలు వ్యవ సాయానికి పనికిరాకుండా పోతాయని వాపోయారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేసేలా చూడాలని కోరారు.



ఎన్‌హెచ్ 167బీ బైపాస్ రోడు బ్రిడ్జి వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సంగం ఐటీఐ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

సంగం, జూలై 4: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో కళాశాలలో డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆదేశాల మేరకు గురువారం ఉత్తీర్ణులైన ఐటీఐ విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. సంగం, ఏఎస్‌పేట నుంచి వంద మంది హాజరవగా, వివిధ కంపెనీలకు 70మంది ఎంపికైయ్యారు. వారందరికీ ఆయా కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, కిసాన్ క్రాఫ్ట్, రామయ్యపట్నం, సీమెన్ గమేశా, హోండా మెటార్స్ బజాజ్ ఆటో మొబైల్స్ వంటి కంపెనీ ప్రతినిధులు, సంగం, ఏఎస్‌పేట, నెల్లూరు ఐటీఐ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, గౌస్‌భాషా పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి : బీటీఏ

లింగసముద్రం, జూలై 4: రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల ని బహుజన టీచర్స్ అసోషియేషన్ (బీటీఏ) గౌరవ అధ్యక్షుడు కల్లగుంట మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వీఆర్ కోట, పెదపవని కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో బీటీఏ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్, పీఆర్సీ, ఏపీజీఎల్ఐ బకాయిలను చెల్లించాలని కోరారు.అలాగే మండలంలో నిలిచిపోయిన నాడు-నేడు ఫేజ్ 2 పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీటీఏ నాయకులు షేక్ అబ్దుల్లా, దార్ల కోటేశ్వరరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పీ మాధవరావు, పర్రె వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత ఎన్వీ సుబ్బారావు ఆకస్మిక మృతి

కందుకూరు, జూలై 4: మండల టీడీపీ సీనియర్ నేత ఎన్వీ సుబ్బారావు (68) గురువారం ఆకస్మికంగా మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందిన ఆయన హైదరాబాద్‌లో తన కుమారుడు వద్ద ఉంటున్నారు. ఆరోగ్యం విషమించడంతో గురువారం వేకువజామున మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు సుబ్బారావు పార్థివదేహానికి నివాళులర్పించారు. మరో మాజీఎమ్మెల్యే దివి శివరాం సుబ్బారావు మృతిపట్ల కన్నీటిపర్యంతమయ్యారు..



ఎన్వీ సుబ్బారావు(ఫైల్

పెన్షనర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

కందుకూరు : డివిజన్ పెన్షనర్ల సంఘం కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడిగా రావులకొల్లు వెంకటేశ్వర్లు(ఆర్వీ), అధ్యక్షుడిగా చిమ్మిరి నరసింహం, కోశాధికారిగా పి. శ్రీనివాసరావు, కార్యదర్శులుగా ఎంఎస్ రాంబాబు, ఇంటూరి మాల్యాద్రి, వై. సత్యనారాయణ, పున్నయ్య, చెన్నయ్య, జీవీ కృష్ణారావు, ఉపాధ్యక్షు లుగా ఎం. భైరాగిశాస్త్రి, సామాను బ్రహ్మయ్య, ఏవీ నరసమ్మ, షేక్ మహబూబ్‌బాషా, నజీర్ అహ్మద్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు విశ్వరూపాచారి, రాఘవరావు పాల్గొనగా, ఎన్నికల అధికారులుగా శంకరరెడ్డి, రాజయ్యలు వ్యవహరించారు.

'టీఆర్ఆర్'లో అల్లూరి జయంతి

కందుకూరు : స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు డాక్టరు డీ. రామాంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాంపులో 'ప్రకాశం' క్యాడెట్ల ప్రతిభ

కందుకూరు : గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటిగ్రేషన్ క్యాంపులో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు కె. ఆంజనేయులు, ఏ. రమేష్‌లు విశేష ప్రతిభచూపి గుంటూరు గ్రూపు ట్రోఫీని కైవసం చేసుకోవటంలో క్రియాశీలపాత్ర పోషించారని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మరో క్యాడెట్ కె. నరేంద్ర అనంతపురంలో జరిగిన క్యాంపునకు ఎంపికయ్యాడని తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని పలువురు అభినందించారు.

రేపు ఎడ్యుకేషన్ ఫెయిర్

కందుకూరు : ఇంజనీరింగ్, మెడిసిన్, ఎంసీఏ, ఎంబీఏ, హోటల్ మేనేజ్‌మెంట్, ఓవర్సీస్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు అవగాహన కోసం గ్లోబల్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో ఈనెల 6న ఒంగోలులోని ఏ1 కన్వెన్షన్ హాలులో బ్రిలియంట్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జమీల్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరైన విద్యార్థులలో ఇద్దరికి లక్కీ డ్రా ద్వారా ల్యాప్‌టాప్‌లు బహూకరిస్తామన్నారు.

వీవీ పాలెంలో ఇంటూరి పుట్టినరోజు వేడుకలు

వలేటివారిపాలెం : స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు బర్త్‌డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ నేత మాదాల లక్ష్మీనరసింహం కేక్ కట్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకుమాను ఆంజనేయులు, వలేటి నరసింహం, గొర్రెపాటి మాధవరావు, ప్రగడ మోహన్‌కుమార్, గుత్తా కొండయ్య, మార్తీల సుబ్బారెడ్డి, వీరమోసు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు నివాళి



మాజీ సీఎం రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్యనేతలు

కావలి,జూలై 4: ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా గురువారం ఆర్యవైశ్యనేతలు కావలిలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడు తటవర్తి రమేష్ ఆధ్వర్యంలో స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కావలి మహిళా విభాగం నేతలు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొని రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పించి, ఆయన సేవలను కొనియాడారు.

బాలికలకు హాస్టల్ వసతి కల్పించాలి

కావలి, జూలై 4: బడుగువర్గాల బాలికలకు హాస్టల్ వసతి కల్పించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి తెలిపారు. గురువారం ఆయన ఆర్డీవో శీనానాయక్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర బడుగువర్గాల బాలికలకు సంక్షేమ హాస్టళ్లలో సీట్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీట్ల కోసం బాలికలు హాస్టళ్ల చుట్టూ తిరుగుతుంటే అధికారులు పట్టించుకోక పోవటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నక్కా హజరత్తయ్య, శ్రీనివాసులు, జరుగు మల్లి విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్క

జలదంకి : ప్రధాని మోదీ పిలుపుతో జలదంకిలో గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా బీజేవైఎం రాష్ట్ర సోషల్‌మీడియా కో-కన్వీనర్ వడ్డే శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముడి కిషోర్‌రెడ్డి, కమతం బాలకోటయ్య యాదవ్, ఆతిన చైతన్యయాదవ్, శనివరపు ప్రవీణ్‌కుమార్, భీమవరపు మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాల కుటుంబానికి అండగా ఉంటా..

బిట్రగుంట : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దేవరాల చిన్నకొండయ్య కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలు యాదవపాలెంలోని చిన్నకొండయ్య ఇంటికి గురువారం ఆయన వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి సోదరుడు తిరుపతితో మాట్లాడారు. ఆయన వెంట నాయకులు వీరరఘు, మన్సూర్‌బాషా, ఉపసర్పంచు జనార్దన్‌రెడ్డి, తుమ్మల రమణయ్య, మల్లారెడ్డి, ఎంపీటీసీ సుందర్‌రాజ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



ఇందుకూరుపేట : కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రశాంతిరెడ్డి



తోటపల్లిగూడూరు: అల్లూరికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో

ఇందుకూరుపేట, జూలై 4: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా గోమాతకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహాత్మాగాంధీ, పొణక కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు, ఖాదీ వస్త్రాలు సమర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని అన్నారు. దత్తత తీసుకున్న పల్లెపాడు గ్రామాన్ని, గాంధీ ఆశ్రమ ప్రాంత్రాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చెంచు కిషోర్‌బాబు యాదవ్, రావిళ్ల వీరేంద్ర చౌదరి, కోడూరు కమలాకర్‌రెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి, చింతపంటి వెంకటరమణయ్య, చింతపంటి సుబ్రహ్మణ్యం, టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి కె బాలాజీ, ఇన్‌చార్జ్ ఓపీఆర్డీ అజీజ్, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ సెక్రటరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని ఎంపీడీవో రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుచ్చిలోని గోపాలకృష్ణయ్య స్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అల్లూరికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాత దొడ్ల కోదండరామిరెడ్డి విద్యార్థులకు పుస్తకాలు స్కూలు కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్‌కు అందజేశారు. అదేవిధంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలలో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు.

వెంకటాచలం: స్థానిక సెయింట్ జ్యూడ్స్ మానసిక దివ్యాంగుల కేంద్రంలో గురువారం సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహనరంగా జయంతి, మహానటి సావిత్రి వర్థంతిలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మానసిక చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేశారు. బిస్కెట్లు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు వాణిభవాని, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొసైటీ గోదాముల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న లేగుంటపాడు సర్పంచు జెట్టి రాజగోపాలరెడ్డి

కోవూరు, జూలై 4: మండల పరిధిలో ఇటీవల నిర్మించిన సొసైటీ గోదాములను గురువారం సహకార శాఖాధికారులు పరిశీలించారు. చెర్లోపాళెం, వేగూరు, పోతిరెడ్డిపాళెం, పడుగుపాడు గ్రామాల్లో గోదాములు నిర్మించగా పలు అవకతవకలు జరిగాయని పలువురు ఫిర్యాదుచేయడంతో తనిఖీచేశారు. నాబార్డు నిధులతో నిర్మించిన ఈ గోదాములు తమ అవసరాలకు ఉపయోగపడే విధంగా లేవని పలువురు రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సహకార శాఖ కావలి డీఆర్ ఎలమందారావు, డీఎల్‌సీఓ సుభాషిణి, మార్కెటింగ్ శాఖ శేషగిరిరావు, ఇన్‌చార్జి వినోద్, పడుగుపాడు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కే సుబ్రహ్మణ్యం గోదాముల నిర్మాణాల్ని పరిశీలించారు. లేగుంటపాడు సర్పంచు జెట్టి రాజగోపాలరెడ్డి కాంట్రాక్టర్లు గోదాముల్ని నాసిరకంగా నిర్మించారని వివరించారు.

నేడు వెంకటాచలానికి ఎమ్మెల్యే రాక

వెంకటాచలం, జూలై 4: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వెంకటాచలానికి రానున్నట్లు సోమిరెడ్డి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరగనున్న విద్యార్థులకు పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి సోమిరెడ్డి హాజరుకానున్నారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకా

తోటపల్లిగూడూరు, జూలై 4 : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని పొట్లపూడి గ్రామంలో శుక్రవారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రాబీస్ వ్యాధి నిరోధక టీకాలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వేయనున్నట్లు పశువైద్యులు డాక్టర్ షఫీ తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. టీకాలు వేయించుకునే వారు కుక్కలకు మౌత్ మాస్క్ వేసుకుని తీసుకురావాలన్నారు.

ప్రశాంతంగా కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 4: బుచ్చి నగర పంచాయతీ సమావేశ మందిరంలో గురువారం నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, నగర కమిషనర్ రమణబాబు ఆధ్వర్యంలో జరిగిన కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా జరిగింది. సమావేశంలో పెట్టిన రెండు అజెండాలను కౌన్సిలర్లు పార్టీలకతీతంగా ఆమోదించారు. అన్న క్యాంటీన్ ఏర్పాటు, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌పై కౌన్సిలర్లందరూ ఆమోదం తెలిపారు. అనంతరం నగర పంచాయతీలో ఆక్రమిత స్థలాలను గుర్తించి తగు చర్యలను నగర కమిషనర్ కౌన్సిల్ దృష్టికి తీసుకురాగా అందుకు కౌన్సిలర్లు కూడా ఏకీభవించారు.

తిరుమలకు టీడీపీ నేతల పాదయాత్ర



చెర్లోపల్లి నుంచి తిరుమలకు బయలుదేరుతున్న టీడీపీ నాయకులు

మనుబోలు, జూలై 4: రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపొందడంతో చెర్లోపల్లి టీడీపీ నాయకులు గురువారం మొక్కు తీర్చేందుకు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. గ్రామంలోని గోవిందస్వామి ఆలయం నుంచి గ్రామ టీడీపీ నాయకులు కలికి వేణుగోపాల్‌రెడ్డి, పొన్నూరు అశోక్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కాలినడకన పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్ర చేస్తున్నవారికి మండల టీడీపీ సీనియర్ నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, సూరిశెట్టి నాగేశ్వరరావు, తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మానుగుంట సుధాకర్‌రెడ్డి, టి. వెంకురెడ్డి, అమర, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కాకాణి విమర్శలు అర్థరహితం : గుమ్మడి



వెంకటాచలం, జూలై 4: టీడీపీ అధినేత చంద్రబాబు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేస్తున్న విమర్శలు అర్థరహితమని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఎద్దేవా చేశారు. వెంకటాచలంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. వైసీపీ పాలనలో సర్వేపల్లిని సర్వనాశనం చేసిన కాకాణి ఎమ్మెల్యే సోమిరెడ్డిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే సోమిరెడ్డి లక్ష్యమన్నారు. ఇప్పటికైనా కాకాణి విమర్శలు చేయడం మానుకోవాలని హితవుపలికారు.

గ్రామసభకు సర్పంచి, ఉప సర్పంచి డుమ్మా

తోటపల్లిగూడూరు, జూలై 4: మండలంలోని కోడూరు బిట్-2 సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు సర్పంచ్, ఉప సర్పంచ్ హాజరు కాకపోవడంతో టీడీపీ నాయకులు పంచాయతీ సెక్రటరీని నిలదీశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి గ్రామసభకు ఎందుకు హాజరుకాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు యువత నాయకుడు ఊటుకూరు అవినాష్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయానికి రావడంలేదని, ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు వెంటనే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఊటుకూరు దేవా, రామాంజనేయులు, దొరబాబు, వాసు, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

కాకాణి కనుసన్నల్లో పొదలకూరులో అక్రమ లేఅవుట్లు

● నుడా అధికారులు కేసు కట్టరేం.. ● టీడీపీ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న మస్తాన్‌బాబు

పొదలకూరు, జూలై 4: గత వైసీపీ పాలనలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కనుసన్నల్లో పొదలకూరులో అక్రమ లే అవుట్లు విచ్చలవిడిగా వెలిశాయని టీడీపీ నేతలు తలచీరు మస్తాన్‌బాబు, తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు అన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్ ముందు వారు మాట్లాడుతూ కాకాణి ప్రధాన అనుచరులు పొదలకూరులోని స్వర్ణ గార్డెన్ పేరుతో భారీ వెంచర్ వేశారని, ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి, నుడా అనుమతి లేకుండా పలు ప్లాట్లు ప్రజలకు అమ్మారని తెలిపారు. వీరిపై నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదును కేసు కట్టి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 52 అక్రమ లే అవుట్లు పొదలకూరులో ఉన్నాయని, వీటిలో వైసీపీ నాయకులు రూ.కోట్లలో సంపాదించారన్నారు ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాకాణి ఖర్చు పెట్టిన డబ్బంతా అక్రమ లే అవుట్ల ద్వారా సంపాదించినదేనన్నారు. స్వర్ణ గార్డెన్స్ లే అవుట్‌లో కాకాణి తమ బినామీలతో రూ.200 కోట్ల విలువ చేసే వ్యవసాయ పొలాన్ని ఎటువంటి కన్వర్షన్ లేకుండా లేనిదాని ఉన్నట్టుగా ఒక డాక్యుమెంట్ సృష్టించి డీటీసీపీ అప్రూవల్ చూపించి సర్వే నెంబర్లను మార్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రజల సొమ్మును లూటీ చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బక్కయ్య నాయుడు, బోగోలు భాస్కర్ రెడ్డి, అద్దంకి గిరినాయుడు, మల్లినేని వెంకటేష్ నాయుడు, ఆదాల మురళి, అలుపూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

భార్య అలిగి ఊరెళ్లిందని ఆత్మహత్య

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 4: భార్య అలిగి ఊరెళ్లడంతో మనస్థాపానికి గురై ఓ వ్యక్తి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానిక రాఘవరెడ్డి కాలనీలో గురువారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. రాఘవరెడ్డికాలనీలో నివాసముంటున్న మలినేని శ్రీధర్ (37) స్థానిక ఆంధ్రాబ్యాంకు వీధిలో ఇంటర్నెట్ సర్వీస్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబం పోషించుకుంటున్నాడు. మృతుడికి భార్య ఒక బిడ్డ వున్నారు. రెండు రోజుల క్రితం ఇంట్లోని గదిలోకి వెళ్లిన శ్రీధర్ గురవారం కూడా తలుపులు తెరవలేదు. దీంతో తల్లి, బంధువులు అనుమానంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వచ్చి తలుపులు పగలగొట్టడంతో అప్పటికే శ్రీధర్ మృతిచెంది వున్నాడు. మృతికి ముందుగా శ్రీధర్ తన వాట్సాప్ స్టేటస్‌లో తాను చనిపోతున్నట్లుగా మెసేజ్ పెట్టినట్లు తెలిపారు. అయితే మృతుడి భార్య అలిగి ఊరెళ్లడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీధర్ మృతి కుటుంబంలో తీరని విషాదం నింపింది.

అగ్ని ప్రమాద బాధితులకు సైకిళ్ల పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : వంగవీటి మోహనరంగ జయంతి సందర్భంగా వెంకటేశ్వరపురం టిడ్కో ఇళ్లలో ఉన్న అగ్నిప్రమాద బాధితులకు గురువారం సైకిళ్లు పంపిణీ చేశారు. జనసేన పార్టీ నాయకుడు టోనీబాబు ఆధ్వర్యంలో డాక్టర్ సుధా మాధవ్, న్యాయవాది ధామభాను సౌజన్యంతో వీటిని అందజేశారు. టోనీబాబు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాల్లోని పిల్లలకు సైకిళ్లు, మహిళలకు చీరలు, పండ్లు, రొట్టెలు అందజేశామని చెప్పారు.

గుండెపోటుతో విద్యుత్ ఉద్యోగి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 4: స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన చింతల దిలీప్‌కుమార్ (39) కోవూరులోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో యుడిసిగా పనిచేస్తున్నాడు. గురువారం వేకువజామున గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కుమార్తెలున్నారు.



అల్లూరికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు పోలీసు అధికారులు

వివేకానందుడికి శ్రద్ధాంజలి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 4: స్వామి వివేకానంద 120వ వర్ధంతి సందర్భంగా నగరంలోని ములుమూడి బస్టాండు సెంటర్‌లోని ఆయన విగ్రహానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాయకుడు మిడతల రమేష్ మాట్లాడుతూ భారతీయ జీవన విధానాన్ని యావత్ ప్రపంచానికి తెలియజేసిన గొప్ప వ్యక్తి వివేకానందుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహులు నాయుడు, ముక్కు రాధాకృష్ణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

నెల్లూరు(క్రైం), జూలై 4: మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు మాట్లాడుతూ మన్యం ప్రజల హక్కుల కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన ధీరుడు, చైతన్య జ్యోతి అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. మన్యం ప్రజల దీన స్థితిగతులను పరిశీలించి బ్రిటీష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి పోరాటానికి సిద్ధం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐలు రామకృష్ణారెడ్డి, జాన్, ఆర్ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్, పీఆర్సీ బకాయిలు ఇప్పించండి

● మంత్రి ఆనంకు విశ్రాంత ఉద్యోగుల వినతి



మంత్రి రామనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 4 : విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన డీఆర్, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని విశ్రాంత ఉద్యోగులు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా శాఖ నాయకులు మంత్రిని గురువారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందచేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జూన్ నెల పెన్షన్ జూలై 2వ తేదీన ఇచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి పీ వెంకయ్య, కోశాధికారి డీ మురళీమోహన్‌రావు, వీనళినీ మోహన్, కార్యదర్శి వీవీ సుబ్బారావు, ఓం నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

సిటీ ప్లానింగ్ అధికారిపై విచారణ జరపాలి : సీపీఐ



కుర్చీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

నెల్లూరు(సిటీ), జూలై 4 : ప్రజా సమస్యలను పట్టించుకునేందుకు, కనీసం వినేందుకు కూడా ఇష్టపడని సిటీ ప్లానింగ్ అధికారిపై శాఖపరంగా విచారణ చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కార్పొరేషన్‌లోని సిటీ ప్లానింగ్ విభాగం వద్ద సీపీ దేవికుమారిపై నిరసన వ్యక్తం చేస్తూ కుర్చీకి వినతి పత్రం అందించారు. అనంతరం నాయకులు నాగేంద్ర, లీలామోహన్, నరసింహరావు మాట్లాడుతూ పొగతోటలోని ఇరిగేషన్ కాలువపై అక్రమంగా నిర్మాణం జరుగుతున్న విషయాన్ని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు కార్యాలయానికి వస్తే కనీసం తాము చెబుతున్న విషయాన్ని కూడా ఆమె వినేందుకు ఇష్టపడలేదన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోలేని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను డిమాండ్ చేశారు. కమిషనర్ విచారణ చేపట్టేవరకు తాము ఆందోళన చేస్తామని చెప్పారు.

దివ్యాంగులకు దేవుడు చంద్రబాబు : రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, జూలై 4 : ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులకు చంద్రబాబు ప్రభుత్వం అండగా నిలిచిందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సామాజిక పింఛన్లు పెంచిన నేపథ్యంలో గురువారం ఆయన కార్యాలయంలో దివ్యాంగులతో కలిసి చంద్రబాబు ప్రతిమకు పాలభిషేకం చేశారు. దివ్యాంగులకు పింఛన్ రూ.3 వేలను రూ.6 వేలకు పెంచారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల పాలన గాడితప్పిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజానాయుడు, జెన్ని రమణయ్య, చేజర్ల మహేష్, జలదంకి సుధాకర్, హజరత్‌నాయుడు, వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

నాగబాబును కలిసిన జనసేన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 4: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబును, ఎమ్మెల్సీ హరి ప్రసాద్‌ను గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకులు కలిశారు. నూనె మల్లికార్జున యాదవ్, రవికుమార్, కృష్ణారెడ్డి, నాగరత్నం పాల్గొన్నారు.

పాపాలు చేశారు కాబట్టే అనుభవిస్తున్నారు!

● జగన్‌కు టీడీపీ నేత సోమిరెడ్డి కౌంటర్

నెల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు పాపాలు చేశారు కాబట్టే నేడు ఆ ఫలితం అనుభవిస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్‌గా సోమిరెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'పిన్నెల్లి పరామర్శ కోసం నెల్లూరుకు వచ్చిన జగన్ హితబోధలు చేయడం హాస్యాస్పదం. ఆయన అన్నీ డోర్ డెలివరీ చేశారంట.. అవును నిజమే.. డ్రైవర్ సుబ్రహ్మణం డెడ్‌బాడీని ఎమ్మెల్సీ అనంతబాబు డోర్ డెలివరీ చేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కేసులో చిన్నరాయి కారణంగా సీఐ తల పగిలిందట. మరి జగన్ మీద చిన్న గులకరాయి పడిందని విజయవాడకు చెందిన యువకుడిని ఇదే నెల్లూరు సెంట్రల్ జైలులో పెట్టిన విషయం గుర్తుకురాలేదా..?. భుజంపై బఠానీ గింజంత గాయం లేకపోయినా కోడి కత్తి కేసులో శీనుపై కనికరం లేకుండా ఐదేళ్లు జైలులో పెట్టించారు. కులం చూడలేదు, మతం చూడలేదు, పార్టీ చూడలేదంటూ జగన్ మాట్లాడుతున్నారు.. అవును నిజమే.. ఒక రామోజీరావు, ఒక అమర్ రాజా ఫ్యాక్టరీ, సంగం డెయిరీ, రఘురామకృష్ణంరాజు, అచ్చెన్నాయుడు, చివరకు చంద్రబాబు నాయుడును కూడా వదిలిపెట్టకుండా కక్ష సాధింపుల్లో అందరినీ సమానంగా చూశారు. ఈవీఎం పగలకొడితే తప్పేమిటని ఒక సీఎంగా పనిచేసి వ్యక్తి అనడం దురదృష్టకరం. ప్రజాస్వామ్యం అన్నా, ఎన్నికల కమిషన్ అన్నా జగన్‌కు గౌరవం లేదు. చంద్రబాబు నాయుడు అనుభవిస్తారంటూ శాపనార్థాలు పెట్టడం కాదు.. మీరు చేసిన పాపాలకు వచ్చే ఎన్నికల వరకు వైసీపీ ఉంటుందో లేదో చూసుకోండి' అంటూ సోమిరెడ్డి పేర్కొన్నారు.

రోశయ్య ఆశయాలు కొనసాగిస్తాం

● ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షణ్ముఖరావు



రోశయ్యకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 4 : తమిళనాడు మాజీ గవర్నర్, ఉమ్మడి ఏపీ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఆశయాలను కొనసాగిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు, ది అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, నాయకులు తెలిపారు. గురువారం స్టోన్‌హౌస్‌పేటలోని రైస్ క్యాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో రోశయ్య 91వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. షణ్ముఖరావు మాట్లాడుతూ రోశయ్య సుదీర్ఘ కాలం రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. ప్రవీణ్‌శంకర్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆలయాలు, సత్రాలు ఆర్యవైశ్యులకే చెందేలా ముఖ్యమంత్రిగా రోశయ్య జీవో ఇచ్చారని, కానీ గత ప్రభుత్వంలో ఆ జీవో అమలులోకి రాలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆర్యవైశ్యుల సంస్థలన్నింటిని ఆర్యవైశ్యుల ఆధీనంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోట గురుబ్రహ్మం, తిరువీధి ప్రకాష్‌రావు, పీ శేషారావు, దాసా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో సంతపేటలో రోశయ్య జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దర్శి హరికృష్ణ, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కోట మధుసూదన్‌రావు, భాస్కర్, గోపీకృష్ణ, వేటూరి రమేష్, బాలాజీ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని ది క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో సంఘం అధ్యక్షుడు వెంకట కిషోర్, కార్యదర్శి రాజాహజరత్తయ్యలు రోశయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వస్త్ర వ్యాపారులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జితో కలెక్టర్ భేటీ



జిల్లా జడ్జి యామినికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం/ స్టోన్‌హౌస్‌పేట), జూలై 4 : జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఓ ఆనంద్ గురువారం జిల్లా జడ్జి యామినిని కోర్టులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందచేశారు. అలాగే, కలెక్టరేట్‌లో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు, రాష్ట్ర మైనార్టీ నాయకుడు మొహ్మద్ జియాఉల్ హక్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు.

గీతామయి బాలభవన్‌లో అన్నదానం

నెల్లూరు(హరనాథపురం), జూలై 4 : విజయవాడ మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా జయంతి సందర్భంగా నగరంలోని గీతామయి బాలభవన్‌లో గురువారం అన్నదానం చేశారు. ముందుగా మోహన్‌రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వంగవీటి మోహన్‌రంగా మిత్రమండలికి చెందిన ముక్కన సుజిత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వంగవీటి రాధా యూత్ మనోహన్, జమీర్, శ్రీకృష్ణ, కిషోర్, వెంకటరావు పాల్గొన్నారు.

వాత్సల్యలో టైలరింగ్, ఎంబ్రైడరీ శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), జూలై 4 : నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయంలో ఈనెల 11నుంచి ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 40 మంది పేద మహిళలకు మూడు నెలల శిక్షణ ఇస్తామని తెలిపారు.

స్టేడియంలో వైద్యులకు సన్మానం

నెల్లూరు (విద్య), జూలై 4 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను పురస్కరించుకుని గురువారం డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ సత్యనాధ్, డాక్టర్ కృష్ణమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డీవీ సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, నాయకులు జయదేవ్, రాఘవేం ద్రశెట్టి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రొట్టెల పండుగ ఏర్పాట్లు 12కల్లా పూర్తి : ఎస్ఈ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 4 : రొట్టెల పండుగకు తరలివచ్చే భక్తుల కోసం బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు ఘాట్‌లో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని, వాటిని ఈ నెల 12వ తేదీ కల్లా పూర్తి చేస్తామని నగర పాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ సంపత్‌కుమార్ తెలిపారు. పనులకు సంబంధించిన టెండర్ల వ్యవహారం పూర్తయిందని, దర్గాలోని 122 శాశ్వత మరుగుదొడ్లకు మరమ్మతులు చేశామని చెప్పారు. మహిళల కోసం ప్రత్యేక షవర్ బాత్‌లు ఏర్పాటు చేశామన్నారు. యాత్రికుల కోసం నగరంలో ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్ 150 వరకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భక్తులకు నగర పాలక సంస్థ తరపున కల్పించాల్సిన అన్ని వసతులను పండుగ ప్రారంభానికి ముందే సిద్ధం చేస్తున్నామని ఆయన వివరించారు.

సినీ సంగీత దర్శకుడు కీరవాణి పుట్టినరోజు వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 4 : తెలుగు సినీ సంగీత కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లిన సంగీత దర్శకుడు కీరవాణి అని టీవీ నటుడు సింగంశెట్టి మురళీమోహన్‌రావు కొనియాడారు. గురువారం నర్తకి సెంటర్‌లో మురళీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కీరవాణి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. తెలుగు సినిమాకు తొలి ఆస్కార్ అవార్డు సాధించిన వ్యక్తి కీరవాణి అన్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో కేతా సుబ్బారావు, జయప్రకాష్, శీనయ్య, మస్తాన్, అబ్దుల్, అభిమానులు పాల్గొన్నారు.

కిలారి కుటుంబానికి బీద పరామర్శ

నెల్లూరు(వైద్యం), జూలై 4 : ఇటీవల మృతిచెందిన టీడీపీ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కిలారి వెంకట స్వామినాయుడు కుటుంబాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పరామర్శించారు. గురువారం కిలారి ఇంటికి వెళ్లి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కిలారితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, జన్ని రమణయ్య పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 5 జూలై 2024



అప్పుడు అయ్యాఎస్!

జనవరి 31: తిరుపతి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశా ఆ వెంటనే అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఇంటికి వెళ్లి పుష్ప గుచ్ఛం అందజేసి విధేయతను ప్రకటించుకున్నారు.

జగన్‌రెడ్డి పాలన తీరుకూ, చంద్రబాబు సారథ్యంలోని కూటమి పాలనకూ ఉన్న తేడాను ఈ ఫొటోలు చాటిచెబుతున్నాయి.ఎంతస్థాయి అధికారులైనా ఎమ్మెల్యేలకు అణిగిమణిగి ఉండాల్సి వచ్చేది. ఐఏఎస్, ఐపీఎస్ అధికార హోదాలు నాయకుల ముందు తలవంచాల్సి వచ్చేది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. అధికారులకు తగిన మర్యాద ఇవ్వాలని సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలకు చెబుతూవచ్చారు. దీంతో అధికారులే కాదు, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలూ మారారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఇప్పుడు ఐఏఎస్!

జూలై 4: తిరుపతి కలెక్టర్‌గా ఎస్. వెంకటేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కలెక్టరేట్‌కు వెళ్లి, కొత్త కలెక్టర్‌కు శాలువాకప్పి శ్రీవారి జ్ఞాపికను అందజేసి స్వాగతం పలికారు.చంద్రగిరి, సత్యవేడు ఎమ్మెల్యేలు నాని, ఆదిమూలం కూడా కలెక్టరేట్‌లోనే కొత్త కలెక్టర్‌ను కలిశారు.



ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలపై దృష్టిపెడతా
కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి/తిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అధికారుల, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో సంక్షేమం, అభివృద్ధి ఫలాలను ప్రజలకందేలా కృషి చేస్తానని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. తిరుపతి కలెక్టర్‌గా గురువారం ఉదయం కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తామన్నారు.పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.డెంగ్యూ జ్వరాల నివారణ చర్యలపై దృష్టి పెడతామన్నారు. అంతకుముందు ఆయన తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.కలెక్టర్‌గా శ్రీవారి సన్నిధిలో బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు.

ప్రజలకు దారివ్వు పెద్దిరెడ్డీ..!

పబ్లిక్ రోడ్డుకు పెట్టుకున్న గేటు తొలగింపునకు జనసేన యత్నం - అడ్డుకున్న పోలీసులపై ఆగ్రహం

తిరుపతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో వేసిన రోడ్డుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏర్పాటు చేసుకున్న గేట్లు తొలగించడానికి జనసేన చేసిన ప్రయత్నం గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రజాధనంతో నిర్మించిన రోడ్డును స్థానికులకు అందుబాటులోకి లేకుండా సొంత ప్రయోజనాల కోసం పెద్దిరెడ్డి వాడుకుంటున్నారంటూ మీడియాలో కథనాలు రావడంతో కిరణ్ రాయల్ నేతృత్వంలో జనసేన పార్టీ శ్రేణులు గురువారం పెద్దిరెడ్డి ఇంటి ముందు ధర్నాకు దిగారు. గేటును తొలగించాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ తామే తొలగించడానికి పూనుకున్నారు.జనసేన ఆందోళన సమాచారం ముందే తెలుసుకున్న పోలీసులు కిరణ్ రాయల్ తదితరులను పెద్దిరెడ్డి ఇంటి సమీపంలోని బండారు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్ ఘటనాస్థలానికి రావాలని డిమాండు చేశారు. గేట్లు తెరిపించి అందుబాటులోకి తీసుకురావాలని నినదించారు. దాదాపు గంటపాటు నిరసన చేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు రాకపోవడంతో తామే గేట్లు తొలగిస్తామని జనసేన నేతలు కిరణ్ రాయల్, సుభాషిణి తదితరులు బారికేడ్లు తోసుకుని ముందుకు వెళ్లబోయారు. పెద్దఎత్తున మోహరించిన పోలీసులు జనసైనికులను అడ్డుకుని పోలీసు వ్యానులోకి ఎక్కించేప్రయత్నం చేశారు. ఈక్రమంలో కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గేట్లు తొలగించి రెండు కాలనీల వాసులకు దారి కల్పిస్తామని తాము హామీ ఇచ్చామని, అందులో భాగంగా కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేసినట్లు కిరణ్ రాయల్ చెప్పారు. అయినా పట్టించుకోకపోవడంతో తమ నేత పవన్ కల్యాణ్ స్ఫూర్తితో ప్రజలకిచ్చిన మాట కోసం పెద్దిరెడ్డి కోటకు పెట్టుకున్న గేట్లను తొలగించేందుకు వస్తే పోలీసులు వైసీపీ ప్రభుత్వంలో ఉన్నట్లు వ్యవహరించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రభుత్వం మారినా పోలీసులు మారరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇంతలో కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసులు రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గేట్లు తొలగించడానికి రెండు రోజులు సమయం కోరడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిషోర్, మనోజ్, సాయి, కుమార్, శేషాద్రి పాల్గొన్నారు.



గేటు తొలగించాలని పోలీసులతో జనసేన శ్రేణుల వాగ్వాదం



పెద్దిరెడ్డి ఇంటి ముందు రహదారికి అడ్డుగా గేటు



'అసలిది అన్నమేనా, ఎలా తినాలి. కమీషన్లు తీసుకుని చెత్తభోజనం పెడుతున్నారు. మీ ఇంట్లో కూడా ఇలాంటి అన్నమే తింటారా, బయట తినలేక కాదు స్వామి ప్రసాదమని వచ్చాం, ఆకులో పెట్టిన అన్నం ఎవరు తినలేదు. కోట్ల ఆదాయం స్వామికి వస్తోంది. ఇలాంటి అన్నం పెడతారా. టీటీడీకి ఏం తక్కువ. ఆకలితోనే లేచేశాం. చాలా అన్నం వృథా అయ్యింది'

'అన్నప్రసాదం ముద్దగా ఉంటోంది. అసలు రుచి, నాణ్యత కనిపించడం లేదు'

ఇవన్నీ గత ప్రభుత్వంలో టీటీడీ నిర్వహిస్తున్న శ్రీవారి అన్నప్రసాద వితరణపై భక్తుల నుంచి వచ్చిన విమర్శలు.

శ్రీవారి అన్నప్రసాదాల

రుచి మారేనా?

గతంలో వచ్చిన విమర్శలపై టీటీడీ ఈవో సమీక్షలు

ఆహార పదార్థాలను తరచూ తనిఖీ చేయాలని ఆదేశాలు

తిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రూ.5 వేలకోట్ల బడ్జెట్ కలిగిన టీటీడీ భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదాలను వడ్డించడం లేదంటూ భక్తుల నుంచి తరచూ విమర్శలు ఇటీవల ఎక్కువయ్యాయి. స్వామి దర్శనానికి వచ్చే ధనిక భక్తుల నుంచి సామాన్య భక్తుల వరకూ కనీసం ఒక్కపూటైనా స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరిద్దామని వచ్చి తీవ్ర అసంతృప్తితో తిరిగి వెళ్లిపోయిన సందర్భాలు చాలానే ఉన్నాయి.1985నుంచి అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సూచనలతో టీటీడీ భక్తులకు అన్నప్రసాదాలను అందజేస్తోంది. తిరుమలలోని తరిగొండ వెంబమాంబ అన్నప్రసాద భవనంతో పాటు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లలో,బయటి క్యూలైన్లలో, పీఏసీ-4, పీఏసీ-2, వివిధ ప్రాంతాల్లోని ఫుడ్‌కౌంటర్లలో, వృద్ధులు, దివ్యాంగుల క్యూలైన్‌లో, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూకాంప్లెక్స్‌లో, తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం, శ్రీనివాసం,విష్ణునివాసం యాత్రికుల సముదాయాల్లో, రుయా, స్విమ్స్, ప్రసూతి, బర్డ్, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రుల్లో, తిరుచానూరులోని అన్నప్రసాద భవనంలో రోజూ దాదాపు లక్షన్నర మందికి అన్నప్రసాదాలను అందజేస్తోంది. ప్రధానంగా దేశంలోనే ఎక్కడా లేని విధంగా భారీ భవనంలో ఒకేసారి 16 వేలమంది కూర్చుని భోజనం చేసేలా వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని టీటీడీ నడుపుతోంది. ఈ భవనంలో రోజుకు దాదాపు 40 నుంచి 45 వేల మంది భోంచేస్తున్నారు. అయితే ఇటీవల ఈ భవనంలో వడ్డిస్తున్న అన్నప్రసాదాలపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. అన్నం గట్టిగా ఉంటోందని పలుమార్లు విమర్శలొచ్చాయి. ప్రతినెలా నిర్వహించే డయల్ యువర్ ఈవో కార్యక్రమంలోనూ పలువురు భక్తులు అన్నప్రసాదం నాణ్యత బాలేదంటూ నేరుగా ఈవోకే ఫిర్యాదు చేసిన ఘటనలున్నాయి. మరికొంతమంది అన్నం గట్టిగా ఉంటోందని, తినడానికి ఏమాత్రం రుచిగా లేదని చెబుతూ 'నాశనమైపోతారు' వంటి శాపనార్థాలు పెట్టారు. పలువురు భక్తులు తమ ఆవేదనను వీడియోలు తీసి సోషల్ మీడియాలో కూడా పోస్ట్ చేసిన సందర్భాలున్నాయి.కొంతమంది దేవుడి ప్రసాదం కావడంతో బాగాలేదని బయటకు చెప్పలేక రెండు ముద్దలు తిని చేయి కడిగేస్తున్నారు.

నాణ్యత తగ్గిన విషయాన్ని ఒప్పుకున్న టీటీడీ

అన్నప్రసాద విభాగంలో గత రెండేళ్లుగా టెండర్ ద్వారా బియ్యం కొనుగోలు చేస్తున్నామని, నాణ్యత తగ్గడాన్ని తామూ కూడా గుర్తించామంటూ టీటీడీ కూడా ఒప్పుకుంది. భక్తుల నుంచి తరచూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఇకపై రైస్ మిల్లర్ల నుంచి బియ్యం కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని, నిపుణులైన సిబ్బందిని తీసుకుని మరింత నాణ్యంగా అన్నప్రసాదాలను తయారుచేసి అందజేస్తామని చాలా సందర్భాల్లో చెప్పుకొచ్చింది. అయితే అన్నప్రసాదాల తయారీ కోసం టీటీడీ కొనుగోలు చేసే ముడిసరుకుల క్వాలిటీని పరీక్షించేందుకు ల్యాబ్ కూడా అందుబాటులో ఉన్నప్పటికీ అన్నప్రసాదాల నాణ్యత తగ్గడం పలు అనుమానాలకు దారితీస్తోంది. కొంతమంది అధికారులు కమీషన్ల కోసం కక్కుర్తిపడడంవల్లే అన్నప్రసాదాల్లో నాణ్యత, రుచి తగ్గిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.అన్నప్రసాదం ట్రస్టుకు అందుతున్న విరాళాల ద్వారా వచ్చే వడ్డీ ద్వారానే దాదాపుగా అన్నప్రసాదాల వితరణ జరుగుతున్న క్రమంలో ఇలాంటి విమర్శలను ఎదుర్కొవడం శ్రేయస్కరం కాదని భక్తులు అభిప్రాయ పడుతున్నారు. దేవుడి ప్రసాదంగా భావించి భక్తులు స్వీకరించే అన్నప్రసాదాల్లో నాణ్యత, రుచి విషయంలో టీటీడీ మరింత శ్రద్ధ చూపించాల్సిన అవసరముందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

నాణ్యత పెంపుపై ఈవో కసరత్తు

టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతలు స్వీకరించాక తొలుత అన్నప్రసాదాలపై వస్తున్న విమర్శలపైనే ప్రధానంగా దృష్టిసారించారు.నాణ్యత ఎందుకు తగ్గింది, ఎక్కడ లోపాలున్నాయనే అంశాలపై తరచూ సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్నప్రసాదాల తయారీకి వినియోగిస్తున్న బియ్యాన్ని, సరుకులను స్వయంగా పరిశీలించారు. భక్తులకు వడ్డిస్తున్న అన్నప్రసాదాలను నేరుగా రుచి చూసి గుర్తించిన లోపాలపై అధికారులతో మాట్లాడుతున్నారు.ఇకపై భక్తులకు నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాలు అందించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఫుడ్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.నాణ్యతను పెంచేందుకు ఫుడ్ కన్సల్టెంట్‌ను నియమించాలని అభిప్రాయపడ్డారు. అలాగే ముడిసరుకుల కొనుగోళ్లపై దృష్టి సారించారు. నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేసేలా అధికారులతో సమీక్షలు జరుపుతున్నారు. దీంతో రానున్న రోజుల్లో గతంలోలాగే రుచికరమైన అన్నప్రసాదాలు అందుతాయని భక్తులు ఆశపడుతున్నారు.

బస్సు నడుపుతుండగా
డ్రైవరుకు గుండెపోటు

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- కండక్టర్ అప్రమత్తతతో ప్రయాణికుడికి తప్పిన ముప్పు

కల్లూరు, జూలై 4: రాత్రి 9 గంటలు.. కల్లూరుకు ఆర్టీసీ బస్సు వస్తోంది. అదే సమయంలో బస్ డ్రైవరుకు గుండె నొప్పి వచ్చింది. కొద్ది క్షణాలకే తీవ్రమైంది. అప్పటికే చేతిలో స్టీరింగ్ అదుపు తప్పింది. బస్సు రోడ్డు పక్క గుంతలోకి ఒరిగి పోయింది. కండక్టర్ వెంటనే అప్రమత్తమై బస్‌ను నియంత్రించారు. ఆస్పత్రికి తరలించినా డ్రైవరు ప్రాణాలు దక్కలేదు. తిరుపతి నుంచి కొత్తపేట మీదుగా చిత్తూరు జిల్లా కల్లూరుకు బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు బయలుదేరింది. కల్లూరు నైట్ హాల్ట్ కావడంతో బస్సులో ఒక ప్రయాణికుడు మాత్రమే ఉన్నారు. పులిచెర్ల మండలం కొక్కువారిపల్లి సమీపానికి వచ్చేసరికి డ్రైవర్ రాఘవయ్య(56)కు గుండెపోటు వచ్చింది. బస్సును నియంత్రించడం సాధ్యం కాలేదు. బస్సు రోడ్డు పక్కనున్న గుంతలోకి ఒరిగిపోయింది. కండక్టర్ మణి పరిస్థితి గుర్తించారు. హుటాహుటిన ప్రయాణికుడితో కలసి డ్రైవర్‌ను కిందకు దింపారు. అటుగా వెళుతున్న కారును ఆపి పులిచెర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే రాఘవయ్య మృతి చెందినట్లు ధ్రువీకరించారు.రాఘవయ్య మృతదేహాన్ని స్వగ్రామం సోమల మండలం పొదలగుంటపల్లికి తరలించారు. ప్రజా రవాణా సంస్థ జోనల్ కార్యనిర్వహణ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి జితేంద్రనాథ రెడ్డి, పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య, సిబ్బంది సందర్శించి రాఘవయ్యకు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.





రోడ్డు పక్కకు ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు, రాఘవయ్య (ఫైల్ ఫొటో)

రాజముద్రతో 49,535 కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు

- 'భూహక్కు' పత్రాల స్థానంలో

త్వరలోనే రైతులకు అందజేసేందుకు అధికారుల కసరత్తు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 4 : వందేళ్ల తర్వాత భూములు రీసర్వే చేస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. రైతులకు కనీస సమాచారం లేకుండానే హద్దులు పాతారు. హడావుడిగా సర్వే చేసి పల్లెల్లో భూపంచాయితీలు పెంచారు. కోట్లాది రూపాయలు వెచ్చించి జగన్ ఫొటోతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం చేతిలో పెట్టారు. 'భూహక్కు' పత్రమంటూ జగన్ ఫొటోతో ఉన్న పాసుపుస్తకాలు ఇవ్వడంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో తాము అధికారంలోకి రాగానే రాజముద్రతో కూడిన పుస్తకాలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మాదిరే పాసుపుస్తకాలపై ప్రభుత్వ రాజముద్రను మాత్రమే ఉంచాలని సంకల్పించింది. ఈ నేపథ్యంలో భూపరిపాలనశాఖ ప్రధాన కమిషనర్ సాయిప్రసాద్, సర్వే శాఖ కమిషనర్ సిద్ధార్థజైన్ జిల్లా అధికారులతో సమీక్షించినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం భూహక్కు పత్రాలు ఎన్ని పంపిణీ చేసింది. ఇంకా ఎన్ని ఉన్నాయి.. అనే వివరాలు ఆరా తీశారు. ఇప్పటి వరకు జగన్ ఫొటోతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు రెండు విడతల్లో 34,120, మూడో విడతలో 15,415 కలిపి మొత్తం 49,535 పంపిణీ చేసినట్లు సీసీఎల్ఏ అధికారుల దృష్టికి జిల్లా యంత్రాంగం తీసుకెళ్లింది. వీటన్నింటినీ వెనక్కి తీసుకుని, రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను రైతులకు త్వరలోనే అందజేయనున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. కాగా జిల్లావ్యాప్తంగా 34 మండలాల్లో మూడు విడతల్లో 320 గ్రామాల్లో భూసర్వే పూర్తయింది. పొలాల సరిహద్దుల్లో 2.50లక్షల రాళ్లను నాటినట్లు జిల్లా సర్వేశాఖ తెలిపింది. అయితే ఆ రాళ్లపైనా జగన్ బొమ్మతో కూడిన పబ్లిసిటీ తగ్గలేదు. దీనిపైనా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిపైనా కూటమి ప్రభుత్వం ఓ నిర్ణయానికి రానుంది.

24 ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇన్‌టేక్ అడ్మిషన్లకు ఏఐసీటీఈ అనుమతి

తిరుపతి(విద్య), జూలై 4: రాష్ట్రంలో పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో 2024-25 సంవత్సరానికిగాను ఇన్‌టేక్ అడ్మిషన్లకు అనుమతులు ఇస్తూ అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) గురువారం ఉత్తర్వులు వెలువరించింది. ఇందులో చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని మూడు యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలల్లో 1,080 ఇన్‌టేక్ అడ్మిషన్లకు, 21 ప్రైవేట్ కళాశాలల్లో 18,900 ఇన్‌టేక్ అడ్మిషన్లకు, మొత్తంగా 24 కళాశాలల్లో 19,980 ఇన్‌టేక్ అడ్మిషన్లకు అనుమతులు ఇచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే తిరుపతి జిల్లా పుత్తూరు ఇప్పతంగలి గ్రామం ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో 360 ఇన్‌టేక్ అడ్మిషన్లకు ఏఐసీటీఈ అనుమతులు ఇచ్చింది.

తిరుపతి నుంచి అంతర్జాతీయ విమానాలు నడపాలి


మంత్రి రామ్మోహన్‌నాయుడితో వరప్రసాద్

గూడూరు, జూలై 4: తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమానాలు రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకోవాలని గురువారం ఢిల్లీలో కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోనాయుడిని కలిసి విన్నవించినట్లు మాజీ ఎంపీ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ 2014-15 సంవత్సరంలో తాను తిరుపతి ఎంపీగా, చంద్రబాబు రాష్ట్ర సీఎంగా, నరేంద్రమోదీ పీఎంగా ఉన్న సమయంలో తిరుపతి విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా పరిగణించాలని పీఎం, సీఎంలను కోరానని చెప్పారు. దీంతో అప్పటి సీఎం చంద్రబాబు తిరుపతి విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్చినట్లు పేర్కొన్నారు. అయినా పదేళ్లుగా విదేశాల నుంచి ఇక్కడికి ఎటువంటి విమానాల రాకపోకలు జరగలేదన్నారు. ప్రధానంగా తిరుమల పుణ్యక్షేత్రం కావడంతో వివిధ దేశాల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చే ఆస్కారం ఉందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై రామ్మోనాయుడు సానుకూలంగా స్పందిస్తూ మొదటగా గల్ఫ్ దేశాలకు తిరుపతి నుంచి విమానాల రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలియజేయడం ఆనందంగా ఉందన్నారు.

అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడు


నివాళులర్పిస్తున్న వైస్ చైర్మన్‌లు, కమిషనర్ తదితరులు

నాయుడుపేట, జూలై 4: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తికి ప్రతీతి అని, ఆయన చిరస్మరణీయుడని మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ రఫీ, జలదంకి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో గురువారం అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ జనార్థన్‌రెడ్డి, మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, కౌన్సిలర్లు చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, షబ్బీర్, నాయకులు పాలూరు భాస్కర్, పసల చెంగయ్య, కరీంబాయి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక ఎంఈవో కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని ఎంపీడీవో, ఎంఈవో ఆధ్వర్యంలో నిర్వహించారు. అల్లూరిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కృష్ణంరాజు, శివకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోషిబాయి, వీఆర్వోలు సుధాకర్, వంశీకృష్ణ, ఏఎస్‌వో మోహన్, సర్వేయర్ పూజిత తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాల్లో మార్పులు చేయాలి


కోర్టు గేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

నాయుడుపేట టౌన్, జూలై 4: నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు వద్ద న్యాయవాదులు నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన చట్టాలలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కోర్టు గేట్ వద్ద నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవాదులు చెంచు కృష్ణయ్య, దశయ్య, రఫీ, ఈశ్వరయ్య, రమణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్ ద్వారా బిల్లులు చెల్లించాలి

నాయుడుపేట టౌన్, జూలై 4: ఎపీఎస్‌పీడీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించాలని నాయుడుపేట డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ ప్రసన్నకుమార్ తెలిపారు. విద్యుత్‌శాఖ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో విద్యుత్ వినియోగదారులు గూగుల్‌పే, ఫోన్‌పే, అమేజాన్‌పే వంటి యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించేవారని, ప్రస్తుతం ఆర్‌బీఐ నిబంధనల మేరకు ఎపీఎస్‌పీడీసీఎల్ యాప్ ద్వారానే చెల్లించాలని చెప్పారు. ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఇబ్బందులు ఉన్నవారు బిల్ కలెక్టర్ల ద్వారా గాని, వీఆర్‌వో సెంటర్ల ద్వారా గాని చెల్లింపులు చేసుకోవచ్చని తెలిపారు.

రంగాకు నివాళులు



నాయుడుపేట టౌన్, జూలై 4: మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని దర్గా సెంటర్ వద్ద ఆయన చిత్రపటానికి గురువారం బలిజ సంఘ నాయకులు నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బలిజసంఘ నాయకులు కుబేరు మణి, గంధాల చిట్టి, ప్రసాద్, శేషం మునిగోపీ, రాజాబాబు, దాము, బాబు, లక్ష్మీనారాయణ, సతీష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలో శ్రీకృష్ణదేవరాయ, కాపు, బలిజ, తెలగ ట్రస్ట్ కార్యాలయంలో ఆల్‌ఇండియా రాయల్‌కాప్స్ జనరల్ సెక్రటరీ తోట కృష్ణయ్య ఆధ్వర్యంలో గురువారం వంగవీటి మోహన్ రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ వీకే ప్రసాద్, జ్యోతిరావు, తిరుపాల్, ఫకీర్ ఆనంద్, రాజా, గద్దల మునెయ్య, జనసేన నాయకురాలు అన్నపూర్ణ, రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి సన్మానం



నాయుడుపేట టౌన్, జూలై4: సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని నాయుడుపేట న్యాయవాదులు సన్మానించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయశ్రీకి శాలువాకప్పి సన్మానించారు. న్యాయవాదులు పార్థసారథిరెడ్డి, సోమశేఖర్, దశయ్య, చెంగయ్య, రమణయ్య, శ్రీనివాసులు, కిరణ్, అంజయ్య, సుమన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు చేయించుకోండి

దొరవారిసత్రం, జూలై 4: రైతులు తమ పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జోతిర్మయి కోరారు. గురువారం ఆమె మండలంలోని పోలిరెడ్డిపాళెం, వెదురుపట్టు గ్రామాల్లో పర్యటించి, రైతులకు మట్టి నమూనా పరీక్షల గురించి తెలియజేశారు. ప్రతి రైతు తమ గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లోని తమ సిబ్బంది వద్దకు వెళ్లి మట్టినమూనా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. సాగులో ఉన్న వరి పొలాలను పరిశీలించారు. వరిలో ఆకు ముడత, కాండం తొలుచు పురుగు తెగుళ్లను గుర్తించి, నివారణ కోసం పిచికారి మందులను రైతులకు సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

తడ, జూలై 4: మండల పరిధిలోని వేనాడులో గుళికల మందు తాగి సామతాళం రమేష్ (26) ఆత్మహత్య చేసుకొన్న సంఘటన గురువారం చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు వేనాడు పంచాయతీ ఆలాపత్రి గిరిజన సెంటర్‌కు చెందిన సామతాళం రమేష్ ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపం చెందిన మద్యంలో గుళికలు కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరూ పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటరు సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, జూలై 4: మండలంలోని బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో మోటరు సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలు కాగా, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. మండలంలోని అరవపెరిమిడి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రాజేశ్వరి దంపతులు సూళ్లూరుపేట వైపు నుంచి నాయుడుపేటకు మోటరు సైకిల్‌పై వస్తూ మార్గమధ్యంలో బిరదవాడ సమీపంలో రోడ్డు పక్కన ఆగారు. అదే సమయంలో సూళ్లూరుపేట నుంచి మోటరు సైకిల్‌పై వస్తున్న చైతన్య.. వెంకటేశ్వర్లు మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు, చైతన్యకు గాయాలు కాగా, రాజేశ్వరి స్వల్పగాయాలతో బయటపడింది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థికసాయం



గూడూరు, జూలై 4: స్థానిక నలజాల మ్మవీధికి చెందిన సుబ్బారావు అనే వ్యక్తికి వైద్యఖర్చుల నిమిత్తం గురువారం టీడీపీ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు పరిమల రాజేష్ మాట్లాడుతూ సుబ్బారావు అనే టీడీపీ కార్యకర్త కిడ్నీవ్యాధితో బాధపడుతుండటంతో వైద్యఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దాతృత్వంతో రూ.10వేలు ఆర్థికసాయంగా అందజేశామన్నారు. దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా రేబిస్‌వ్యాధి టీకాలు

గూడూరు అర్బన్, జూలై 4: పెంపుడు జంతువులకు జూలై 6వ తేదీన ఉచితంగా రేబిస్ వ్యాధి టీకాలు వేయనున్నట్లు పశుసంవర్థశాఖ ఏడీ డాక్టర్ సురేష్ గురువారం తెలిపారు. జూలై 6వ తేదీన జూనోటిక్ డేను పురస్కరించుకుని టీకాలను ఉచితంగా వేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ పెంపుడు జంతువులకు ఈ టీకాలను వేయించుకోవాలన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

పెళ్లకూరు, జూలై 4: మండలంలోని శిరసనంబేడులో కౌలు రైతులకు గురువారం గుర్తింపు కార్డులు అందజేశారు. మండల వ్యవసాయాధికారి ప్రవీణ మాట్లాడుతూ అర్హత కలిగిన రైతులకు కౌలు గుర్తింపు కార్డులను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఆర్వో మోబీనా, వీపీఏ చందు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం


వాకాడు, జూలై 4: నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని ఎస్‌ఐ పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని అశోక్ పిల్లర్ ప్రాంగణంలో గురువారం ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసు సిబ్బందితో సమానమన్నారు. నేరాలను నియంత్రించవచ్చన్నారు. యువత అసాంఘిక కార్యక్రమాలకు, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. బాలికలకు ఏదైనా సమస్య తలెత్తితే 100కు ఫోన్‌చేయాలన్నారు.

మండల పరిషత్ నిధుల లెక్కలు తేల్చండి


ఈవోపీఆర్‌డీకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ ఎంపీటీసీలు

కోట, జూలై 4: కోట మండల పరిషత్ నిధుల లావాదేవీలపై లెక్కలు తేల్చాలంటూ గురువారం టీడీపీ ఎంపీటీసీలు, నాయకులు ఎంపీడీవో కార్యాలయ అధికారులను నిలదీశారు. మండల పరిషత్‌లో సుమారు రూ.70 లక్షల వరకు పక్కదారి పట్టాయని, ఎలాంటి లెక్కలు లేవని, లావాదేవీలు అనధికారికంగా జరిగాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తక్షణం లెక్కలు చెప్పాలని ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్, వెంకన్నపాళెం సర్పంచ్ మధుయాదవ్, మైనార్టీసెల్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్‌లు పట్టుపట్టారు. ఎంపీడీవో శంకరయ్య సెలవులో ఉన్నారని, సోమవారం వస్తారని, నిధులపై తమకు ఎలాంటి సమాచారం తెలియదని మండల పరిషత్ సిబ్బంది తెలిపారు. దాంతో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులకు మండలపరిషత్ నిధులు లెక్కలు తేల్చాలంటూ వినతిపత్రాన్ని అందజేశారు.

నిరుపేద విద్యార్థిని ఆదుకున్న పాశం


నానీశ్రీరామ్ తల్లికి నగదును అందజేస్తున్న టీడీపీ నేతలు

కోట, జూలై 4: మండల పరిధిలోని చెందోడు గ్రామానికి చెందిన నానీశ్రీరామ్ అనే పేద విద్యార్థికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అండగా నిలిచి భరోసా పంపారు. చీరాలకు చెందిన రాజా అనే యువకుడు విద్యానగర్‌లో కాపురం ఉంటూ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన భార్య సాయికుమారి, కుమారుడు నానీ శ్రీరామ్‌లు అనాథలుగా నిలిచి రోడ్డునపడ్డారు. ఈ విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే టీడీపీ నాయకుల ద్వారా నానీశ్రీరామ్ చదువుతున్న పాఠశాలకు కట్టాల్సిన ఫీజులు రూ.15వేలు, యూనిఫాం, పుస్తకాలకు మరో రూ.10వేలను సునీల్‌కుమార్ పంపారు. ఆయా నగదును టీడీపీ జిల్లా కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి, లోక్కు రఘునాథరెడ్డి, బందిలి రఘురామయ్య, సుబ్రహ్మణ్యం యాదవ్ చేతులమీదుగా సాయికుమారికి అందజేసి, పాఠశాల ఫీజులు చెల్లించారు. ఎమ్మెల్యే స్పందనపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెళ్లకూరు, జూలై 4: వాతావరణ మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెళ్లకూరు వైద్యాధికారి సుజాతమ్మ సూచించారు. గురువారం మండలంలోని చిల్లకూరు, దిగువ చావాలి గ్రామాల్లో పెళ్లకూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎస్‌ఎంలు భూలక్ష్మీ, పొన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు పవిత్ర, రజిత తదితరులు పాల్గొన్నారు.

నవ్యాంధ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ఎమ్మెల్యే విజయశ్రీ


కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల

నాయుడుపేట టౌన్, జూలై 4: నవ్యాంధ్ర అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని తుమ్మూరులో గురువారం రాత్రి జరిగిన విజయోత్సవ అభినందనసభలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, వాటి ద్వారా లోన్‌లు మంజూరు చేసి పేదలను ఆదుకున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. తరువాత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్లను నిర్వీర్యంచేసి పేదల కడుపుకొట్టిందని విమర్శించారు. ఓటు అనే వజ్రాయుధం ద్వారా ప్రజలు మంచి తీర్పు ఇచ్చారని, రాష్ట్రాభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. అంతకుముందు తుమ్మూరులో భారీ ర్యాలీతో కరిమాణిక్య స్వామి ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేక్ కట్‌చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, తరుమూరు సుధాకర్‌రెడ్డి, పసల గంగాప్రసాద్, 786 రఫీ, నెలవల రాజేష్, శివకుమార్‌రెడ్డి, తుమ్మూరు గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గాయపడిన బాలుడి మృతి


భరత్‌కుమార్ (ఫైల్ ఫొటో)

పెళ్లకూరు, జూలై 4: ఇటీవల విద్యుదాఘాతంతో గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బాధితుల కథనం మేరకు పెళ్లకూరు మండలం చిల్లకూరు దళిత కాలనీకి చెందిన నెలబల్లి మహేష్, భువనేశ్వరి దంపతుల కుమారుడు భరత్‌కుమార్ (15) 9వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో మే 19వ తేదీన స్నేహితులతో కలసి కాలనీ సమీపంలోని పాత పరిశ్రమ సమీపంలో క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లారు. ఈ క్రమంలో క్రికెట్ బాల్ సమీపంలోని పాత పరిశ్రమ ఆవరణలో పడటంతో దానిని తెచ్చేందుకు భరత్‌కుమార్ ప్రహరీని ఎక్కి దాటే సమయంలో కిందకు వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో బాలుడికి రెండు కాళ్లు, చేతులతో పాటు శరీరభాగాలు కాలిపోయాయి. తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్సలో భాగంగా భరత్‌కుమార్ రెండు కాళ్లను జూన్ 1వ తేదీన తొలగించారు. అయినప్పటికీ భరత్‌కుమార్ ఆరోగ్యం కుదుటపడలేదు. సుమారు రెండు నెలలు మృత్యువుతో పోరాడి చివరకు భరత్‌కుమార్ ప్రాణాలు కోల్పోయాడు. చాలా కాలంగా విద్యుత్ తీగలు ప్రమాదకర స్థితిలో ఉండటం, ఆశాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని బాధితుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. అయినా పోలీసులు ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. రెండు నెలలు పాటు మృత్యువుతో పోరాడి చివరకు తమ బిడ్డ మృతి చెందాడంటూ ఆ తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. తమ బిడ్డకు 15 ఏళ్లకే నూరేళ్లు నిండాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

కోట, జూలై 4: బడిఈడు కలిగిన పిల్లలు విధిగా పాఠశాలల్లో ఉండేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో శైలజ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విద్యావిధానం, బడిఈడు పిల్లలు తదితర అంశాలపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, గురుకులాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లతో సమావేశం జరిగింది. బడి ప్రదేశ్, నేను బడికిపోతా, ప్రవేశం అంశాలపై ప్రధానోపాధ్యాయులతో సమీక్ష జరిగింది. మండలంలోని 21 పంచాయతీల్లో బడిఈడు పిల్లలపై సర్వే నిర్వహించి, విధిగా బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

గూడూరు అర్బన్, జూలై 4: స్థానిక ఏరియా ఆస్పత్రిలోని రోగులకు ఎల్‌ఐసీ 74వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ నాగులు, ఉద్యోగులు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశామన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్

నాయుడుపేట, జూలై 4: నూతనంగా నియమితులైన కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ జనార్థన్‌రెడ్డి గురువారం కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ విజయోత్సవ ర్యాలీ


ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

వాకాడు, జూలై 4: తెలుగుదేశం ఎమ్మెల్యేగా పాశం సునీల్‌కుమార్ ఘన విజయం సాధించడంతో వాకాడు మండలంలో టీడీపీ శ్రేణులు గురువారం సాయంత్రం నానాజీతో కలసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కోట క్రాస్ రోడ్డు నుంచి వందల సంఖ్యలో బైక్‌లు, కార్లతో విజయోత్సవ ర్యాలీ రంగన్నగుంటకు చేరుకొని అక్కడ నుంచి వాకాడు అశోక్‌పిల్లర్‌కు చేరుకుంది. యువత బాణాసంచా కాలుస్తూ డీజేలతో కేరింతలు కొట్టారు. మొదటగా ఆర్టీసీ డిపోకు చేరుకొని విజయవాడకు వెళ్లే రెండు కొత్త ఎలక్ట్రికల్ బస్సులను ఎమ్మెల్యే పాశం ప్రారంభించారు. రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు ఆయనను సన్మానించారు. ఫారెస్టు అధికారులు చేపల మార్కెట్ స్థలంలో ఎమ్మెల్యేతో మొక్కలు నాటించారు. వాకాడు అశోక్‌పిల్లర్ సమీపంలో అభిమానులు క్రేన్ ద్వారా ఏర్పాటు చేసిన గజమాలతో సత్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాకాడు బజారుమీదుగా బీసీ కాలనీకి చేరుకొని, గొల్లపాళెం వరకు రోడ్‌షో కొనసాగింది. ఈ ర్యాలీలో నాయకులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, ఉచ్చూరు ప్రసాద్‌రెడ్డి, కుంచం దయాకర్, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు జనార్థన్‌రెడ్డి, బత్తిన ప్రమీల, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, అన్నమేటి చంద్రయ్య, కోట శ్రీనివాసులు, తీపలపూడి రమణయ్య, పసుపులేటి రాజయ్య, దోశకాయల కృష్ణమూర్తి, షేక్ గౌస్‌మోహిద్దీన్, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరలో ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీస్ ల్యాబ్ ఏర్పాటు


ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ వంకి పెంచలయ్య

గూడూరు అర్బన్, జూలై 4: గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్రప్రభుత్వ సహాయంతో ఏసీఐసీ ద్వారా ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీస్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య తెలిపారు. ఇండస్ట్రీస్ 4.0 టెక్నాలజీస్ ద్వారా రోబోటిక్స్, త్రీడీప్రింటింగ్, ఎలక్ట్రిక్ వెహికల్స్ తదితర రంగాల్లో విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచి వారు ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు కృషిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ల్యాబ్ ఏర్పాటుకు ఒక మిలియన్ రూపాయలను టీకీబోట్ సంస్థ సమకూర్చనుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మురుగదాస్, టీకీబోట్ సంస్థ సీఈవో డాక్టర్ వెంకటరెడ్డి, ఏసీఐసీ సీఈవో డాక్టర్ ఇమ్మానియేల్, ప్రొఫెసర్లు డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ ధనుంజయ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళి, జే రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలర్ వితరణ



కోట, జూలై 4: కోట మండల పరిషత్ కార్యాలయానికి గురువారం అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎన్.దేవకి కూలర్‌ను వితరణగా ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయానికి పలు సమస్యలపై వచ్చే ప్రజలు, సిబ్బందికి చల్లని మినరల్ వాటర్‌ను అందించాలన్న లక్ష్యంతో ఆమె ఈ కూలర్‌ను అందచేశారు. దేవకిని మండల పరిషత్ సిబ్బంది అభినందించారు.

రిటైర్డ్ ఏఎస్‌ఐలకు సత్కారం


రిటైర్డ్ ఏఎస్‌ఐ సుబ్రమ్మణ్యం, వీరమ్మ దంపతులను సత్కరిస్తున్న మురళీకృష్ణారెడ్డి

పెళ్లకూరు, జూలై 4: పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐలుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన కిలివేటి సుబ్రహ్మణ్యం, కొండూరు వెంకటరామరాజులను తాళ్లయిపాడు ఏవీ ఫంక్షన్ హాలులో గురువారం పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వీరిని నాయుడుపేట టౌన్, రూరల్ సీఐలు జగన్‌మోహన్‌రావు, శ్రీనివాసులురెడ్డి, నాయుడుపేట, పెళ్లకూరు, దొరవారిసత్రం ఎస్‌ఐలు గోపీ, శ్రీకాంత్, తిరుమలరావులతో పాటు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, అక్కరపల్లి మాధవరెడ్డి, శిరసనంబేటి సుధాకర్‌రెడ్డి, శిరసనంబేడు సర్పంచు గుంటపూడి పెంచలయ్య తదితరులు సత్కరించారు.

విద్యాసంస్థల బంద్

గూడూరు అర్బన్, జూలై 4: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యావిధానాల వలన విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారే ప్రమాదం ఉందని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షల్లో జరిగిన అవినీతికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా గురువారం బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో గూడూరులో పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. నీట్ పరీక్షల్లో అవినీతి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శశికుమార్ డిమాండ్ చేశారు. బంద్‌కు సహకరించిన విద్యాసంస్థల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, పలు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

శాఖాపరమైన విచారణ వేగిరపరచండి

- రెవెన్యూ విశ్రాంత ఉద్యోగుల వేడుకోలు


మీడియాతో మాట్లాడుతున్న జయచంద్ర

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 4: ఉత్తపుణ్యానికి శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు.. ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగుల కేసులను త్వరగా పరిష్కరించి ఆదుకోవాలని విశ్రాంత తహసీల్దార్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.జయచంద్ర అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఏసీబీ, ప్రభుత్వ ఆస్తులు, ధనాన్ని కాజేసిన కేసుల విషయంలో తాము సహాయాన్ని అర్థించడం లేదన్నారు. కానీ రెవెన్యూ శాఖలో చాలామంది ఉద్యోగులు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండానే క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటివారు రిటైర్ అయ్యాక ఆర్థికంగా, కుటుంబపరంగా చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ కేసుల్లో విచారణాధికారులు త్వరగా విచారణ పూర్తిచేయక పోవడంతో పెన్షన్, ఇతర ప్రయోజనాలు అందక వారి జీవనం అస్తవ్యస్తం అయిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరైతే మతిచలించి తిరుగుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా చిత్తూరు ఉమ్మడి జిల్లాలో అధికారులు అత్యంత నిర్దయగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కొందరు అధికారులైతే భరించలేని భాషను వాడుతూ.. అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణ చర్యలపై విచారణ ఎదుర్కొంటున్నవారు జిల్లాలో సుమారు 400 మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, వారి కేసులను సత్వరం విచారించి.. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని విన్నవించారు. ఇప్పటికే అధికారుల చుట్టూ తిరిగి, ప్రెస్‌మీట్లు పెట్టి వయోభారంతో అలసిపోయానని, ఇదే తన చివరి ప్రెస్‌మీట్ అని గద్గద స్వరంతో అన్నారు. సమావేశంలో విశ్రాంత ఉప తహసీల్దార్ పీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

170 ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఓ స్మగ్లర్ అరెస్టు, రెండు కార్ల సీజ్


పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలతో ఫ్లయింగ్ స్క్వాడ్, పుత్తూరు అటవీశాఖ సిబ్బంది

పుత్తూరుఅర్బన్/కేవీబీపురం, జూలై 4: రెండు సంఘటనల్లో తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్, పుత్తూరు అటవీశాఖ అధికారులు గురువారం 170 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ స్మగ్లర్‌ను అరెస్టు చేసి, రెండు కార్లను సీజ్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్‌కు అందిన రహస్య సమాచారంతో సిబ్బంది పుత్తూరు మండలం గొల్లపల్లె మామిడి తోపు వద్ద తనిఖీలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో అటువైపు వస్తున్న ఓ కారును ఆపేందుకు ప్రయత్నించారు. ఆగకుండా వెళ్లిపోవడంతో ఫ్లయింగ్‌స్క్వాడ్ సిబ్బంది వెంబడించారు. కొద్ది దూరం వెళ్లాక నిందితులు వాహనాన్ని వదిలి మామిడితోటలోకి పారిపోయారు. అధికారులు తనిఖీ చేయగా వాహనంలో ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. దాంతో వాహనాన్నీ, అందులోని 125 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని.. తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ కార్యాలయానికి తరలించారు. ఈ దుంగల బరువు 947 కిలోలు ఉంటుందని డీఎఫ్‌వో శివకుమార్ తెలిపారు. అలాగేపుత్తూరు అటవీశాఖ అధికారులు కేవీబీపురం నుంచి పిచ్చాటూరు వెళ్లే రహదారిలో తనిఖీలు చేపట్టారు. ఓ కారు మారప్పరెడ్డికండ్రిగ వద్ద అనుమానాస్పదంగా ఉండగా అధికారులు చుట్టుముట్టారు. తనిఖీ చేయగా వాహనంలో 45 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. దాంతో దుంగలతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, అందులోని ఓ స్మగ్లర్‌ని అరెస్టు చేశారు. పట్టుబడ్డ దుంగల బరువు 327.9 కిలోలు ఉంటుందని అధికారులు తెలిపారు. తనిఖీల్లో తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ప్రసాద్‌కుమార్, డ్రైవర్లు సాయి, కిరణ్, షణ్ముగం, స్ట్రైకింగ్ ఫోర్సు సిబ్బంది మునస్వామి, వినీల్‌కుమార్, పుత్తూరు అటవీశాఖ సిబ్బంది చైతన్య, సురేష్‌కుమార్, నీలకంఠం, వాసు, గోపి, రఘు, సింహాద్రి, ప్రవీణ్ పాల్గొన్నారు.